ఆంధ్రజ్యోతి
ఉష్ణోగ్రత అనంతపురం గరిష్ఠం : 39.0 కనిష్ఠం : 27.0
ANDHRAJYOTHY
5

అనంతపురం
జిల్లా వార్తలు
శనివారం 22 మార్చి 2025

న్యాక్‌లో మెరుగైన గ్రేడ్ సాధించాలి

ఎస్కేయూ ఇన్‌చార్జ్ వీసీ అనిత


మాట్లాడుతున్న వీసీ అనిత

అనంతపురం సెంట్రల్, మార్చి 21(ఆంధ్ర జ్యోతి): విద్యాప్రవమాణాల గుర్తింపునిచ్చే నేషనల్ అసెస్మెంట్ అండ్ అక్రెడిటేషన్ కౌన్సిల్(న్యాక్)లో మెరుగైన గ్రేడ్‌ను సాధించేలా పనిచేయాలని ఎస్కేయూ ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ అనిత అధికారులకు సూచించారు. వర్సిటీలో ఇంటర్నల్ క్వాలిటీ అష్యూరెన్స్ సెల్(ఐక్యూఏసీ) సమీక్షా సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. సెంట్రల్ యూనివర్సిటీ ప్రొ-చాన్సలర్ రాజశేఖర్ న్యాక్ అంశాలపై వివరించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ రమేష్‌బాబు, విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

రేపు సీపీఐ బహిరంగ సభ

పార్టీ జిల్లా కార్యదర్శి జాఫర్


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

అనంతపురం విద్య, మార్చి 21(ఆంధ్ర జ్యోతి): కేంద్రం ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ ఈ నెల 23న అనంతపురంలో సీపీఐ బహిరంగ సభ నిర్వహిస్తోందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి జాఫర్ తెలిపారు. నగరంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం బహిరంగసభ పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. మూడోసారి అధికారంలోకి వచ్చిన మోదీ ప్రభుత్వం, ఆర్ఎస్ఎస్ అనుకూల సిద్ధాంతాన్ని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు పావులు కదుపుతోందని ఆరోపించారు. మతోన్మాద విధానాలతో కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా వ్యవహరిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రాలకు రాజ్యాంగం కల్పించిన హక్కులను కాలరాస్తున్నారని మండిపడ్డారు. రాజ్యాంగాన్ని కాపాడేందుకు సీపీఐ దేశవ్యాప్తంగా ఈ నెల 23 నుంచి వచ్చే నెల 14 వరకూ ప్రచార కార్యక్రమాలు నిర్వహించనుందని తెలిపారు. ఈ నెల 23వ తేదీ సాయంత్రం ర్యాలీ నిర్వహించి, కేఎస్ఆర్ కాలేజీ వద్ద భారీ బహిరంగ సభను నిర్వహిస్తామని తెలిపారు. సభకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కార్యదర్శివర్గ సభ్యులు హాజరవుతారని, కార్మికులు, ప్రజలు, ప్రజాస్వామ్యవాదులు జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

లా పరీక్షల్లో 13 మంది డిబార్


పరీక్షల నిర్వహణను పరిశీలిస్తున్న రిజిస్ట్రార్ రమేష్

అనంతపురం సెంట్రల్, మార్చి 21(ఆంధ్ర జ్యోతి): ఎస్కేయూ లా పరీక్షల్లో శుక్రవారం మాస్ కాపీయింగ్‌కు పాల్పడిన 13మంది విద్యార్థులను డిబార్ చేశామని పరీక్షల నిర్వహణ విభాగాధిపతి ప్రొఫెసర్ జీవీ రమణ తెలిపారు. వర్సిటీలో మూడేళ్ల ఎల్ఎల్‌బీ విద్యార్థులకు, విజయనగర లా కాలేజీలో చదువుతున్న ఐదేళ్ల ఎల్ఎల్‌బీ విద్యార్థులకు, ఎల్ఎల్ఎం విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఇంజనీరింగ్ కళాశాలలో మాస్ కాపీయింగ్‌కు పాల్పడిన 13 మందిని డిబార్ చేశారు. పరీక్షల నిర్వహణను రెక్టార్ వెంకట నాయుడు, రిజిస్ట్రార్ డాక్టర్ రమేష్ నాయుడు, లా కాలేజీ విభాగధిపతి డాక్టర్ శ్రీరాములు, ప్రిన్సిపాల్స్ డాక్టర్ రామచంద్ర, డాక్టర్ సోమశేఖర్ పర్యవేక్షించారు.


ఉపాధి ఉద్యోగుల చేరికపై సందిగ్ధం

డ్వామా బదిలీల్లో తిరకాసు

అనంతపురం క్లాక్‌టవర్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): డ్వామా బదిలీల్లో ఆయా స్థానాలకు కేటాయించిన ఉద్యోగుల చేరికపై సందిగ్ధత నెలకొంది. బదిలీ స్థానాల్లో ఉద్యోగులు చేరేందుకు శనివారమే గడువు కావడంతో ఉత్కంఠ నెలకొంది. రాజకీయ సిఫారసు లేఖలను పరిగణనలోకి తీసుకోకుండా సొంత నిర్ణయాలు, ముడుపులు పుచ్చుకుని బదిలీలు చేశారనే విమర్శలు వస్తున్నాయి. శింగనమల నియోజకవర్గంలో పనిచేస్తున్న ఏపీఓలు ఎర్రెమ్మ, రమేష్, రామారావు, శ్రీదేవి తమకు అవసరం లేదని ప్రజాప్రతినిధులు సిఫారసులను డ్వామా అధికారులకు పంపారు. అయినా.. వారిని అదేస్థానాల్లో కొనసాగించారు. కూడేరు నుంచి పామిడికి బదిలీ చేసిన తులసీప్రసాద్ స్థానంలో మరో ఏపీఓ ఆదినారాయణమ్మను బదిలీ చేయడంతో వారి మధ్య వివాదం నడుస్తోంది. గార్లదిన్నెలో పనిచేస్తున్న నాంచారమ్మను అనంతపురం రూరల్ మండలానికి, పామిడి ఏపీఓ మల్లేశ్వరిని బుక్కరాయసముద్రానికి బదిలీ చేయడం వివాదాస్పదమవుతోంది. టెక్నికల్ అసిస్టెంట్, కంప్యూటర్ ఆపరేటర్ల బదిలీలల్లోనూ ఇదే సందిగ్ధత నెలకొంది. బదిలీ స్థానాల్లో ఉద్యోగులు చేరుతారా, వేరే స్థానాలకు వెళ్లాల్సి ఉంటుందా అన్న దానిపై ఉత్కంఠ నెలకొంది. ప్రస్తుతం ప్రజాప్రతినిధుల సిఫారసు లేఖలను డ్వామా అధికారులు ఖాతరు చేయలేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీనిపై ఆయా ప్రజాప్రతినిధులు అసంతృప్తితో ఉన్నట్లు తెలుస్తోంది.

ఉపాధి నిధులతో 30లక్షల మొక్కలు

- అటవీశాఖతో కలిసి అభివృద్ధి
- డ్వామా పీడీ సలీంబాషా


కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న డ్వామా పీడీ సలీంబాషా

అనంతపురం క్లాక్‌టవర్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉపాధి నిధులతో అటవీశాఖ సహకారంతో ఈ ఏడాది 30లక్షలకుపైగా మొక్కలు నాటాలని ప్రభుత్వం లక్ష్యం నిర్దేశించిందని డ్వామా పీడీ సలీంబాషా తెలిపారు. సోషల్ ఫారెస్ట్ డీఎఫ్ఓ చంద్రశేఖర్‌తో కలిసి డ్వామా పీడీ సోమవారం అటవీశాఖ అధికారులు, ఏపీఓలతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. పీడీ మాట్లాడుతూ.. అటవీ శాఖ నర్సరీల్లో ఉపాధి నిధులతో 30లక్షలకు పైగా మొక్కలు పెంచాలన్నారు. వాటిని పొలాల గట్లపైన, రోడ్లకిరువైపులా, విద్యా సంస్థలు, ప్రభుత్వ కార్యాలయాల్లో నాటాలన్నారు.

తాడిపత్రిలో ఉద్రిక్తత

వైసీపీ నాయకుడు ఫయాజ్‌బాషా ఇంటి నిర్మాణంపై వివాదం(7లో..)

జలమే జయం!
- నీరుంటేనే అభివృద్ధి
- విలువ తెలుసుకుని వాడుకోవాలి

నేడు ప్రపంచ జల దినోత్సవం (6లో..)

రంజాన్ వేళలు
ఇఫ్తార్ : 6.32 (శనివారం సాయంత్రం)
సెహరీ : 5.05 (ఆదివారం ఉదయం)



సూపర్ స్పెషాలిటీలో ముందుకు సాగని పనులు
రోగులకు తప్పని ఎదురుచూపులు

సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో క్యాజువాలిటీ విభాగ ఏర్పాటుకు కాసుల కష్టాలు వెంటాడుతున్నాయి. నెలన్నర క్రితమేఅక్కడ క్యాజువాలిటీ ఏర్పాటు చేసి, జిల్లా ప్రజలకు నిరంతరం వైద్యసేవలు అందించాలని నిర్ణయం తీసుకున్నారు. అందుకు సంబంధించిన పనులు అడుగు కూడా ముందుకు పడట్లేదు. దీనికి కాసులు లేకపోవడమే కారణమన్న ప్రచారం సాగుతోంది.

- ఆంధ్రజ్యోతి, అనంతపురం టౌన్

క్యాజువాలిటీకి కాసుల కష్టాలు



రెండేళ్ల తర్వాత..

జిల్లా కేంద్రంలోని శారదానగర్‌లో రూ.150 కోట్లు ఖర్చు పెట్టి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ఏర్పాటు చేశారు. టీడీపీ హయాంలో ఆస్పత్రిని మంజూరు చేసి, నిర్మాణం చేపట్టారు. 2019లో వైసీపీ అధికారం చేపట్టాక సూపర్‌స్పెషాలిటీకి కష్టాలు మొదలయ్యాయి. ఆస్పత్రి అభివృద్ధిని పట్టించుకున్న పాపాన పోలేదు. ఆ తర్వాత తొలుత జిల్లా ఆస్పత్రినుంచి వెళ్లిన రోగులకు మాత్రమే ఆపరేషన్లు చేస్తూ వచ్చారు. తద్వారా ప్రజలకు పెద్దగా ఉపయోగం లేదన్న విమర్శలు వచ్చాయి. ఉన్నతాధికారులు స్పందించి, వారంలో రెండ్రోజులు ఒక్కో విభాగ డాక్టర్లు ఓపీ సేవలు అందించాలని నిర్ణయించారు. అలా.. రెండేళ్లుగా ఓపీ సేవలు అరకొరగా అందుతున్నాయి. ఎమర్జెన్సీ కేసులు అక్కడకు వెళ్లడానికి క్యాజువాలిటీ లేక అనేక అవస్థలు పడుతూ వస్తున్నారు. ఈ నేపథ్యంలో గతేడాది ఏర్పాటైన కొత్త ప్రభుత్వం సూపర్ స్పెషాలిటీలో క్యాజువాలిటీ ఏర్పాటు చేస్తే గుండె, న్యూరో, నెఫ్రాలజీ, గ్యాస్ట్రో ఎంట్రాలజీ తదితర కీలక రోగాలకు అత్యవసర చికిత్సలు అందుతాయని రాష్ట్ర అధికారులపై జిల్లా నేతలు ఒత్తిడి తీసుకొచ్చారు. ఆ మేరకు ఈ ఏడాది జనవరిలో డీఎంఈ ఆస్పత్రిని పరిశీలించి, సూపర్ స్పెషాలిటీలో వెంటనే క్యాజువాలిటీ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించి వెళ్లారు.

ముందుకు పడని అడుగు

క్యాజువాలిటీ ఏర్పాటుకు ఆదేశాలు ఇచ్చినా ఇక్కడ మాత్రం అడుగు ముందుకు పడట్లేదు. సూపర్ స్పెషాలిటీలో క్యాంటీన్ కోసం నిర్మించిన భవనం.. క్యాజువాలిటీ ఏర్పాటుకు అనుగుణంగా ఉంటుందని సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు.. వైద్యులతో సమావేశమై నిర్ణయం తీసుకున్నారు. అక్కడ అవసరమైన ఏర్పాట్లు చేయడానికి అంచనాలు వేయించారు. అందుకు రూ.16 లక్షల నుంచి రూ.20లక్షల వరకు వ్యయం అవుతుందని ఇంజనీర్లు లెక్క కట్టారు. ఆ తర్వాత ప్రక్రియ ముందుకు సాగలేదు.

దీనికి ప్రధాన కారణం నిధులు లేకపోవడమేనని తెలుస్తోంది. జిల్లాఆస్పత్రిలో నిధుల్లేవనీ, వైద్య కళాశాల నుంచి కేటాయించాలని లేఖ పెట్టుకున్నారు. అక్కడి నుంచి నిధులు ఇవ్వకపోవడంతో క్యాజువాలిటీ పనులు ఆగిపోయినట్లు చెప్పుకుంటున్నారు. ఈ నేపథ్యంలో క్యాజువాలిటీ ఏర్పాటుపై అయోమయం నెలకొంది. జిల్లా ప్రజలకు క్యాజువాలిటీ సేవల కోసం ఎదురుచూపులు తప్పట్లేదు.

వైద్య కళాశాలకు లేఖ రాశాం

సూపర్ స్పెషాలిటీలో క్యాజువాలిటీ తప్పకుండా ఏర్పాటు చేస్తాం. అందుకు అవసరమైన నిధులివ్వాలని ఉన్నతాధికారుల సూచన మేరకు వైద్య కళాశాలకు లేఖ రాశాం. నిధులు వచ్చిన వెంటనే పనులు పూర్తి చేస్తాం. క్యాజువాలిటీ సేవలు అందుబాటులోకి తెస్తాం.

- డాక్టర్ వెంకటేశ్వరరావు, సూపరింటెండెంట్, జిల్లా ఆస్పత్రి

త్వరలో ఇస్తాం..

క్యాజువాలిటీ ఏర్పాటుకు నిధులు అడిగినమాట వాస్తవమే. కొన్ని కారణాల వల్ల మంజూరులో ఆలస్యమైంది. అందుకు సంబంధించిన ఫైల్‌ను డీఎంఈ ఆమోదానికి పంపాం. రెండ్రోజుల్లో క్లియర్ అవుతుంది.

- డాక్టర్ మాణిక్యాలరావు, ప్రిన్సిపాల్, వైద్య కళాశాల

వేసవి జాగ్రత్తలు తీసుకోండి: కలెక్టర్



అనంతపురం టౌన్, మార్చి21 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరు వేసవి జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టరు డాక్టరు వినోద్‌కుమార్ సూచించారు. ఎండ లు,, వాటివల్ల కలిగే ప్రమాదాలు, ప్రజలు పాటించాల్సిన జాగ్రత్తల గురించి శుక్రవారం ఆయన వివరించారు. ఎండలకు తిరిగితే వడదెబ్బతో పాటు వివిధ రకాల అనారోగ్యాలకు గురయ్యే ప్రమాదం ఉందన్నారు. అందుకే ఎండలు తీవ్రంగా ఉన్నపుడు జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలన్నారు. తెల్లని వదులైన దుస్తులు ధరించాలని, ఎండాకాలంలో ఉప్పు కలిపిననీరు, గ్లూకోజ్ కలిపిన నీరు ఎక్కువగా తీసుకోవాలన్నారు. వడదెబ్బకు గురైన వారు నిర్లక్ష్యం చేయకుండా డాక్టర్లవద్దకు వెళ్లి తగిన వైద్యం తీసుకోవాలన్నారు.

24లోపు గ్రామసభలు పూర్తి చేయండి: డీపీఓ

అనంతపురం న్యూటౌన్, మార్చి 21(ఆంధ్ర జ్యోతి): జిల్లాలోని 31 మండలాల్లోని అన్ని గ్రామ పంచాయతీల్లో ఈనెల 24 లోపు పీ-4 సర్వేపై గ్రామసభలు పూర్తి చేయాలని డీపీఓ నాగరాజనాయుడు ఆదేశించారు. అందులో భాగంగా ప్రతి పంచాయతీలోను 10 శాతం మంది ధనికులతో 20 శాతం పేదలను అనుసంధానం చేయాలన్నారు. ఆ జాబితాను ప్రతి కార్యదర్శి ప్రతి పంచాయతీలోను ప్రచురించి గ్రామసభలు నిర్వహించాలని ఆదేశించారు. దీనిపై డీఎల్‌పీఓలు, ఈఓఆర్డీలు ప్రత్యేక శ్రద్ధ వహించి ఎలాంటి సమస్యలు తలెత్తకుండా జరిగేలా చూడాలని ఆదేశించారు.

షాక్ కొడుతోంది..!

జిల్లా విద్యుత్ శాఖలో ఏఈఈల కొరత (6లో)

మరీ.. ఇంత చిన్న బెంచీలా..!

- వెంటనే మార్చండి
- పరీక్షాకేంద్రాల్లో అసౌకర్యాలపై కలెక్టర్ అసంతృప్తి


కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం విద్య, మార్చి 21(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షా కేంద్రాల్లో అసౌకర్యాలపై కలెక్టర్ వినోద్ కుమార్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన నగరంలోని గుడ్ చిల్డ్రన్ స్కూల్‌లోని ఏ, బీ పరీక్షా కేంద్రాలను శుక్రవారం తనిఖీ చేశారు. కొన్నికేంద్రాల్లో బెంచీలు తక్కువగా ఏర్పాటు చేయడంపై కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. చిన్న బెంచీలు మార్చాలని ఆదేశించారు. పరీక్షలు నిర్వహించే ముందు కేంద్రాల్లోని తరగతి గదులను అధికారులు పరిశీలించాలనీ, విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా చూడాలన్నారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని కేంద్రాల్లో తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మెడికల్ కిట్లు అందుబాటులో ఉంచాలన్నారు. అధికారులు అలసత్వం ప్రదర్శిస్తే... కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

998 మంది విద్యార్థుల గైర్హాజరు

టెన్త్ పరీక్షలకు జిల్లావ్యాప్తంగా 998 మంది గైర్హాజరయ్యారు. పరీక్షల్లో రెగ్యులర్ 31,009 మందికిగాను 30,213 మంది రాయగా.. 796 మంది గైర్హాజరయ్యారు. ప్రైవేటు విద్యార్థులు 30 మందికిగాను 16 మంది పరీక్ష రాయగా.. 14 మంది గైర్హాజరయ్యారు. ఓపెన్ స్కూల్ విద్యార్థులు 1,052 మందికిగాను 864 మంది హాజరుకాగా.. 188 మంది గైర్హాజరయ్యారు.

పొరపాట్లకు తావివ్వద్దు

అనంతపురం టౌన్, మార్చి 21(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షల నిర్వహణలో చిన్నపొరపాటుకు కూడా అవకాశం ఇవ్వద్దని అధికారులను జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశించారు. స్థానిక క్యాంపు కార్యాలయం నుంచి శుక్రవారం ఆయన.. అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. పది పరీక్షలు సజావుగా నిర్వహించాలన్నారు. జిల్లాలో ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలన్నారు. అదనపు ఆర్థికసాయం అందించడంపై లబ్ధిదారులకు అవగాహన కల్పించాలన్నారు. పీ-4 సర్వే ను పెండింగ్ లేకుండా పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీఈఓ ప్రసాద్‌బాబు, డీపీఓ నాగరాజు, హౌసింగ్ పీడీ శైలజ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

బహుముఖ ప్రజ్ఞాశాలి 'పప్పూరు'

మనవడు విజయ్‌కుమార్


పప్పూరు రామాచార్యులు విగ్రహం వద్ద నివాళులు..

అనంతపురం కల్చరల్/క్రైం, మార్చి 21(ఆంధ్రజ్యోతి): రాయలసీమ, ముఖ్యంగా అనంతపురం జిల్లాలో తనదైన ముద్రవేసి, ప్రజలను చైతన్యవంతం చేసిన బహుముఖ ప్రజ్ఞాశాలి, సేవాతత్పరుడు పప్పూరు రామాచార్యులు అని ఆయన మనవడు విజయ్ కుమార్ అన్నారు. పప్పూరు రామాచార్యులు స్మారక కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం రామాచార్యులు 53వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ సర్వజనాస్పత్రి సమీపంలో పప్పూరు రామాచార్యులు విగ్రహానికి ఆయన మనవడు విజయ్‌కుమార్‌తోపాటు నగరపాలకసంస్థ మేయర్ వసీం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... పప్పూరు రామాచార్యులు ఆధునిక వైతాళికుడని, శ్రీబాగ్ ఒడంబడికలో కీలకపాత్ర పోషించి అందరి మన్ననలు పొందారన్నారు. ధర్మవరం ఎమ్మెల్యేగా, గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా, సింహాచలం దేవస్థాన చైర్మన్‌గా సేవలందించారన్నారు. ఇలాంటి మహనీయుల జయంతి, వర్ధంతి కార్యక్రమాలను రాష్ట్ర ప్రభుత్వమే నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో పప్పూరు రామాచార్యులు స్మారక కమిటీ సభ్యులు జ్వాలాపురం శ్రీకాంత్, నాగలింగయ్య, ఆచార్య బాలసుబ్రహ్మణ్యం, మేయర్ వసీం, డాక్టర్ నానీల నాగేంద్ర, జగర్లపూడి శ్యామసుందరశాస్త్రి, పూజారి ఈరన్న పాల్గొన్నారు.

ఇబ్బంది కలిగిస్తేనే తిరుగుబాటు

వన్యప్రాణుల సంరక్షణ ట్రైనర్ స్వామినాథన్

అనంతపురం న్యూటౌన్, మార్చి 21(ఆంధ్రజ్యోతి): వన్యప్రాణులకు ఇబ్బంది కల్గిస్తేనే, తిరగబడతాయని వన్యప్రాణుల సంరక్షణ ట్రైనర్ స్వామినాథన్ పేర్కొన్నారు. జాతీయ అటవీ దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక పంపనూరు నగరవనంలో డీఎఫ్ఓ ఆధ్వర్యంలో శుక్రవారం సిబ్బందికి శిక్షణ ఏర్పాటు చేశారు. అందులో భాగంగా వన్యప్రాణులను ఏ విధంగా సంరక్షించాలి? వాటి నుంచి ఇబ్బంది పడకుండా ఏవిధంగా జాగ్రత్తలు తీసుకోవాలన్నా దానిపై స్వామినాథన్‌తో శిక్షణ ఇప్పించారు. ఆయన మాట్లాడుతూ అడవిలో తిండి, నీళ్లు లేకపోవడం ద్వారానే జనావాసాల్లోకి వన్యప్రాణులు వస్తుంటాయన్నారు. సిబ్బంది మెలకువలు పాటించి వాటిని సురక్షితంగా అడవిలో వదలాలన్నారు. జాతీయ అటవీశాఖ దినోత్సవం రోజున ఇలాంటి శిక్షణ ఏర్పాటు చేసుకోవడం శుభపరిణామమని జిల్లా అటవీశాఖాధికారి విఘ్నేష్ పేర్కొన్నారు. శిక్షణలో రేంజర్లు శ్రీనివాసులు, మధుబాబు, సెక్షన్ ఆఫీసర్స్ అక్బర్, నారపరెడ్డి, జగన్నాథం తో పాటు పలువురు బీట్ ఆఫీసర్లు సిబ్బంది పాల్గొన్నారు.


జనారణ్యంలో వన్యప్రాణులను ఎలా పట్టుకోవాలన్న దానిపై శిక్షణ



ఆరోగ్య చెలిమ..!

ప్రజల దాహం తీరుస్తున్న చెలిమ నీరు

శింగనమల చిన్న చెలిమలో నీరు తీసుకుంటున్న మహిళ

శింగనమల: నియోజకవర్గ కేంద్రం శింగనమల ఎస్సీ కాలనీవాసుల దాహార్తి తీరుస్తోంది చెలిమ. తరాలుగా చెలిమ నీరే తాగుతున్నామనీ, అనారోగ్య సమస్యలు తలెత్తట్లేదని కాలనీవాసులు పేర్కొంటున్నారు. రోజూ చెలిమ నీటిని బిందెల్లో తెచ్చుకుని, తాగుతున్నారు. చెలిమ నీరు స్వచ్ఛంగా ఉంటోందని వారు చెబుతున్నారు. శింగనమల ఎస్సీ కాలనీ సమీపంలో రుషింగమయ్య కొండ ఉంది. కొండపై అక్కదేవతల పెద్ద కొలను ఉంది. ఆ కొలనులో నిత్యం నీరు పుష్కలంగా ఉంటుంది. వేసవిలో కూడా నీరు ఉంటుంది. కొండ చుట్టూ 7 కొలను చెలిమలు ఉన్నాయి. పూర్వం నుంచి ఈ చెలిమల్లోని నీటిని ప్రజలు తాగుతున్నారు. శింగనమల ఎస్సీ కాలనీ సమీపంలోని రేగలకుంట వద్ద చిన్న చెలిమ ఉంది. అందులోని నీటినే కాలనీకి చెందిన వెయ్యి కుటుంబాలవారు నేటికీ తాగుతున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో బిందెలతో నీరు తెచ్చుకుంటున్నారు.

- ఆంధ్రజ్యోతి, శింగనమల

పశువులకు సైతం



ముచ్చురామిలో ట్యాంకర్ నీటిని పట్టుకుంటున్న ఓ కుటుంబం

ధర్మవరం రూరల్, మార్చి 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముచ్చురామి, నేలకోట, బడన్నపల్లి ఎస్సీకాలనీ, ఏలుకుంట్ల ఫైకాలనీ తదితర గ్రామాల ప్రజలు తాగునీటి సమస్యతో అల్లాడుతున్నారు. ముచ్చురామిలో ట్యాంకర్‌కు రూ.1500 బాడుగలు వెచ్చించి నీటిని కొనుగోలు చేస్తున్నారు. పాడి పశువులకు కూడా నీరు లేకపోవడంతో వాటిని అమ్ముకుంటున్నట్లు పలువురు రైతులు పేర్కొంటున్నారు. ఎండలు మరింత పెరిగితే మరిన్ని ఇబ్బందులు పడాల్సి వస్తుందని ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. కాగా, గ్రామాల్లో నెలకొన్న తాగునీటి సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు చేపట్టినట్లు ధర్మవరం ఎంపీడీఓ సాయిమనోహర్ పేర్కొన్నారు.

సమస్త ప్రాణకోటికి జీవనాధారం నీరు. ఆయా ప్రాంతాల అభివృద్ధి అక్కడ లభించే నీటి వనరులపైనే ఆధారపడి ఉంటుంది. ప్రకృతి వరప్రసాదమైన నీటిని కొంతమంది ఇష్టానుసారం వృథా చేస్తున్నారు. అయితే చాలా ప్రాంతాల్లో స్వచ్ఛమైన నీటి కోసం ప్రజలు పడే ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. ప్రాణాధారమైన నీటి కోసం దేశాలు, రాష్ట్రాలు, ప్రాంతాల మధ్య పంచాయితీలు జరుగుతూనే ఉన్నాయి. దీన్ని బట్టి నీటి ప్రాధాన్యం అర్థం చేసుకోవచ్చు. దేశంలో అత్యంత దుర్భిక్ష ప్రాంతంగా వాసికెక్కిన ఉమ్మడి జిల్లాలో ఉన్న అరకొర జలవనరులను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది. నేడు నిర్లక్ష్యం వహిస్తే రేపటి తరానికి శాపగ్రస్తమైన జీవితం తప్పదు. ఇప్పటికే వేసవి సమీపిస్తే చాలు ఉమ్మడి జిల్లాలో చాలా గ్రామాలు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయి. ప్రభుత్వం ప్రజల దాహార్తి తీర్చడం కోసం ఏటా కోట్ల రూపాయలు ఖర్చు పెడుతోంది. ప్రపంచ జల దినోత్సవం శనివారం జరుపుకుంటున్న సందర్భంలో ఉమ్మడి జిల్లా స్థితిగతులపై కథనం.

జలమే.. జయం..!

- నీరుంటేనే అభివృద్ధి
- విలువ తెలుసుకుని వాడుకోవాలి
- పొదుపును అలవర్చుకోవాలి
- భూగర్భ జలాన్ని రక్షించాలి
- ప్రజల్లో చైతన్యం పెంపొందించాలి
- ఇప్పటికే పల్లెల్లో తాగునీటికి కటకట

నేడు ప్రపంచ జల దినోత్సవం

తనకల్లు/ అనంతపురం న్యూటౌన్ మార్చి21 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో అరకొర నీటి ప్రాజెక్టులే తప్ప భారీ ప్రాజెక్టులు ఏవీ లేవు. అందుకే 80శాతం వ్యవసాయం వర్షాధారంగా సాగుతుంది. వేసవి వస్తే చాలు వాగులు, వంకలు ఎండిపోయి, బోరుబావులు అడుగంటి తాగునీటికి కూడా కటకటలాడాల్సి వస్తోంది. వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాలు పెంపొందేలా అవగాహన కార్యక్రమాలు ప్రభుత్వాలు చేస్తున్నప్పటికీ పూర్తి స్థాయిలో అమలు కావడం లేదు. దీంతో తీవ్ర నీటి కరువు వేధిస్తోంది. కొన్ని చోట్ల వెయ్యి అడుగులు తవ్వినా నీటి చెమ్మ కనిపించని దుస్థితి ఉంది.



నీటి ఆదాకోసం తుంపర సేద్యం ప్రోత్సహిస్తున్న దృశ్యం

భూగర్భ జల రక్షణ కోసం ఉమ్మడి జిల్లాలో 2005 నుంచి వాల్టా చట్టం అమలు చేస్తున్నా... పెద్దగా ప్రయోజనం కనిపించడం లేదు. జల సంరక్షణ కోసం జనజాగృతి వంటి స్వచ్ఛంద సంస్థలు ప్రజల్లో అవగాహన కల్పించేందుకు విస్తృత కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. ప్రతి ఏటా పంట-నీరు ప్రణాళిక కార్యక్రమాలను చేపట్టి, రైతులకు నీటి వాడకంపై అవగాహన కల్పిస్తున్నాయి.

నీటి ఎద్దడి రానివ్వం



జిల్లాకు నీటి ఎద్దడి రానివ్వకుండా తగిని చర్యలు చేపడుతున్నాం. గుంతకల్లు మండలంలోని ఒక పంచాయతీ, శింగనమల మండలంలోని మరో పంచాయతీలో తప్ప జిల్లాలో ఎక్కడ సమస్యలు లేవు. శింగనమల మండలంలో బోరు వేయడం ద్వారా సమస్య పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. గుంతకల్లు మండలంలో బోరు వేసిన తగిన నీటి లభ్యత లేకపోవడంతో ప్రత్యామ్నాయం వైపు చూస్తున్నాం.

-సురేష్, ఎస్ఈ, గ్రామీణ నీటి సరఫరా విభాగం, అనంతపురం జిల్లా

నీటిని ఒడిసి పట్టాలి



జిల్లాలో నీటిని ఒడిసి పట్టుకోవాల్సిందే. ప్రతి ఐదెకరాలకు ఒక ఫాంపాండ్ తవ్వుకోవాలి. పడే వర్షంలో పదిశాతం మాత్రమే భూగర్భ జలాలుగా మారుతాయి. జిల్లా వ్యాప్తంగా 96 పిజో మీటర్లు ఏర్పాటు చేసి, భూగర్భజలాలను పర్యవేక్షిస్తున్నాం. ప్రస్తుతం జిల్లాలో 10.17 మీటర్ల లోతులో నీరున్నాయి. మేనెలలో మరింత లోతుకు వెళ్లే ప్రమాదముంది. గత ఏడాది 17 మీటర్ల లోతులో నీరుండగా, ఈఏడాది మరింత లోతుకు వెళ్లే అవకాశముంది.

-మల్లికార్జునరావు, డిప్యూటీ డైరెక్టర్, గ్రౌండ్ వాటర్ డిపార్టుమెంటు, శ్రీసత్యసాయి జిల్లా

భవిష్యత్తుకు ప్రమాదం



జిల్లా వ్యాప్తంగా ప్రతి ఒకరు నీటి సంరక్షణ చర్యలు చేపట్టకపోతే, భవిష్యత్ తరాలకు ప్రమాదమే. ఇప్పటికే ఉపాధి హామీ పథకం ద్వారా ఫాంపాండ్లు, ఇంకుడు గుంతలు, ట్రెంచ్‌ల నిర్మాణం, పండ్లతోటల పెంపకం, వాటర్‌షెడ్ కార్యక్రమాలు, అమృత్ సరోవర్ లాంటి కార్యక్రమాల ద్వారా సహజ వనరుల సంరక్షణకు ఎన్నో ప్రయత్నాలు చేస్తున్నాం. జిల్లాలో వివిధ పథకాల ద్వారా ఈ ఏడాది 2.72 టీఎంసీల నీటిని భూమిలోకి ఇంకింపజేశాం. ప్రతి ఒకరు నీటిని పొదుపుగా వాడాలి.

-విజయప్రసాద్, ప్రాజెక్టు డైరెక్టర్, జిల్లా నీటియజమాన్య సంస్థ

సహజ వనరులను సంరక్షించాలి



జిల్లాలో ఉపాధి పథకం, వాటర్ షెడ్ కార్యక్రమాల ద్వారా నీటి సంరక్షణ కోసం కృషి చేస్తున్నారు. సహజ వనరుల సంరక్షణద్వారానే భూగర్భజలాలను పెంపొందించవచ్చు. మా సంస్థ ద్వారా మొగిలిచెట్ల తండా వద్ద 210 ఎకరాల్లో అడవులను కాపాడటం ద్వారా నీటి సంరక్షణకు కృషి చేస్తున్నాం. జిల్లా వ్యాప్తంగా సామాజిక కట్టుబాట్లను తీసుకు వచ్చి అడవుల పెంపకం చేపడితే భూగర్భజలాలు పెరుగుతాయి. నీటిని ఉమ్మడి వనరుగా ప్రకటించాలి. భూగర్భ జలాలు వాడుకుంటున్న ప్రతి ఒకరు నీటిని భూమిలోకి నీటిని ఇంకించేలా కార్యక్రమాలు చేపట్టాలి.

- బలరాం, సీఈఓ, జనజాగృతి సంస్థ

జల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి : కలెక్టర్



అనంతపురం టౌన్: ప్రపంచ జలదినోత్సవాన్ని శనివారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించాలని అధికారులకు కలెక్టరు వినోద్‌కుమార్ శుక్రవారం ఆదేశించారు. తొలుత గ్రామీణాభివృద్ధిశాఖామంత్రి పవన్‌కళ్యాణ్ కలెక్టర్లతో నిర్వహించిన కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జలదినోత్సవం, పల్లెపండుగ నిర్వహణపై మంత్రి పలు ఆదేశాలిచ్చారు. అనంతరం కలెక్టరు జిల్లా, డివిజన్, నియోజకవర్గ, మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ తాను ఉరవకొండ నియోజకవర్గంలో జరిగే జిల్లా స్థాయి జలదినోత్సవంలో పాల్గొంటున్నట్లు వెల్లడించారు. ప్రతి పంచాయతీలలోను 3నుంచి 5వరకు ఫారంపాండ్ పనులు మొదలు పెట్టాలన్నారు. జిల్లాలో 9వేల ఫారంపాండ్‌ల నిర్మాణం లక్ష్యంగా పెట్టుకోగా ఇప్పటివరకు 6,864 మంజూరుచేశామన్నారు. జిల్లాలో మెటీరియల్ ఖర్చులకు రూ.186.41కోట్లు లక్ష్యం పెట్టుకోగా అంతకన్నా ఎక్కువగా ఖర్చు పెట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో డ్వామా పీడీ సలీమ్‌బాషా, జడ్పీ సీఈఓ రామచంద్రారెడ్డి, డీపీఓ నాగరాజునాయుడు, పంచాయతీరాజ్ ఎస్ఈ జహీర్‌బాషా, ఆర్‌డబ్ల్యుఎస్ఎస్ఈ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

గొంతెండుతున్న గ్రామాలు

అనంతపురం జిల్లాలో పలు గ్రామ పంచాయతీలు వేసవి ప్రారంభంలోనే తాగునీటి కోసం అల్లాడిపోతున్నాయి. అనంతపురం రూరల్ మండలంలోని 16 గ్రామ పంచాయతీల్లో తీవ్ర తాగునీటి ఎద్దడి ఏర్పడే అవకాశం ఉన్నట్లు అధికారులు నివేదికలు తయారు చేశారు. ఇక్కడ 66 వేలకు పైగా జనాభా ఉంది. జిల్లాలోని 31 మండలాల్లోని 130 గ్రామాల్లో నీటి ఎద్దడి ఉన్నట్లు అధికారులు నివేదిక తయారు చేశారు. ఈ వేసవిలో జిల్లాలో తాగునీటి ఎద్దడని ఎదుర్కొనేందుకు రూ.5.87 అవసరం అవుతుందని అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు.



నీటి ఎద్దడి తలెత్తే పంచాయతీలు...

అనంతపురం రూరల్‌లో 16, బుక్కరాయసముద్రం మండలంలో 6 , శింగనమల 9, గార్లదిన్నె4, కంబదూరు 12, పుట్లూరు6, నార్పలలో 8, గుంతకల్లు6, గుత్తి 6, ఆత్మకూరు 6, కూడేరు 5, విడపనకల్లు 5, యల్లనూరు 8, కుందుర్పి 5, శెట్టూరు 5, బ్రహ్మసముద్రం 3, కళ్యాణదుర్గం 8, ఉరవకొండలో 4 పంచాయతీలకు సంబంధించి 130 గ్రామాల్లో ఈ వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తే అవకాశం ఉన్నట్లు అధికారులు నివేదికలు పంపారు.

ప్రజలకు సమ్మె గుబులు...?

జిల్లా ప్రజల తాగునీటి అవసరాలను సత్యసాయి, శ్రీరామిరెడ్డి ప్రాజెక్టు లు తీరుస్తున్నాయి. అయితే ఇందులో పని చేస్తున్న కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోసం ఎప్పుడైనా సమ్మె చేపట్టే అవకాశం ఉండటం గుబులు రేపుతోంది. అధికారులు గాని, ప్రజప్రతినిధులు గాని వారి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపలేకపోతున్నారు. కార్మికులు సమ్మె చేసినప్పుడు మాత్రం హడావుడి చేసే అధికారులు ఆనక పట్టించుకో వడం లేదు. దీంతో ఈ ప్రాజెక్టుల పరిధిలో ఉన్న గ్రామాల ప్రజలు ఈ వేసవిలో తాగునీటి సమస్య లేకుండా గడిచిపోతే చాలని ఎదురుచూస్తున్నారు.



రైతులకు నీటివాడకంపై అవగాహన కార్యక్రమం



నీటి నిల్వ కోసం తనకల్లు వద్ద తవ్విన ఫాంపాండ్

షాక్ కొడుతోంది..!

జిల్లా విద్యుత్ శాఖలో ఏఈఈల కొరత

- జిల్లా కేంద్రంలోని డి-4 విద్యుత్తు సెక్షన్‌కు ఏఈఈ లేక నెలలు గడుస్తోంది. ఈనేపథ్యంలో డి-1 సెక్షన్ ఏఈఈకి ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. డి-5సెక్షన్ పరిస్థితి ఇలాగే ఉంది. స్థానికంగా ఏఈఈ లేకపోవడంతో ఆత్మకూరు మండలం ఏఈఈకి ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. ఉన్న విధులతోనే సతమతమవుతుంటే అదనపు బాధ్యతలు కేటాయించడంపై వారు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

- శింగనమల మండలానికి కొన్ని నెలలుగా ఏఈఈ లేరు. తాడిప్రతిలో పనిచేస్తున్న జూనియర్ ఇంజనీర్‌కు శింగనమల ఏఈఈ ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. వజ్రకరూరుకు ఏఈఈ లేకపోవడంతో గుంతకల్లులో పనిచేస్తున్న జూనియర్ ఇంజనీర్‌కు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. యాడికి మండలానికి తాడిపత్రిలోని డి-1సెక్షన్‌లో పనిచేసే జూనియర్ ఇంజనీర్‌ను ఇన్‌చార్జ్‌గా నియమించారు. ఇలా ఏఈఈలు లేకపోవడంతో జూనియర్ ఇంజనీర్లే జిల్లా విద్యుత్తు శాఖకు దిక్కుగా మారారు.

• 30శాతం పోస్టులు ఖాళీ • ఆయా స్థానాల్లో జూనియర్ ఇంజనీర్లే దిక్కు • పని ఒత్తిడిలో సిబ్బంది.. సేవలపై ప్రభావం



జిల్లా విద్యుత్తు శాఖ కార్యాలయం

అనంతపురంరూరల్, మార్చి 21(ఆంధ్రజ్యోతి): విద్యుత్తు శాఖలో క్షేత్రస్థాయిలో పనిచేసే అధికారులు లేకపోవడంతో పాలన కుంటు పడింది. జిల్లా వ్యాప్తంగా 40శాతం వరకు ఏఈఈ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఈఈల కొరత కారణంగా ఆయా కార్యాలయాలు, పక్క ప్రాంతాలు, సెక్షన్లలో పనిచేసే జూనియర్ ఇంజనీర్లే విద్యుత్ శాఖకు దిక్కుగా మారారు. ఖాళీగా ఉన్న ప్రాంతాల్లో ఎక్కువశాతం ఏఈఈల కంటే జూనియర్ ఇంజనీర్లే విధులు నిర్వహిస్తున్నారు. ఆ ప్రభావం విద్యుత్ సేవలపై పడుతోంది.

సేవలపై ప్రభావం

క్షేత్రస్థాయిలో పనిచేసే ఏఈఈలు లేకపోవడంతో సంబంధిత కార్యాల యాల్లో పాలన అధ్వానంగా తయారైంది. ఇన్‌చార్జులుగా నియమితులైన వారు తమ సెక్షన్ల పనులు చూసుకునే సరికే రోజులు గడిచిపోతున్నాయి, ఈనేపథ్యంలో ఇన్‌చార్జులుగా ఉన్న కార్యాలయాలకు అప్పుడప్పుడూ వెళ్లి వస్తున్నారు. దీంతో ఆయా సెక్షన్లతో పాలన కుంటుపడుతోంది. ఆ ప్రభావం కాస్తా వినియోగదారులకు అందే సేవలపై పడుతోంది. జిల్లా వ్యాప్తంగా గృహ కనెక్షన్లు 6,17,598 ఉన్నాయి. కమర్షియల్ కనెక్షన్లు 72,061, ఇండస్ట్రీస్ 3,530, తాగునీటి కనెక్షన్లు, వీధి దీపాలకు సంబంధించి కనెక్షన్లు 12,803, వ్యవసాయ కనెక్షన్లు 1,84,542 కనెక్షన్లు ఇలా మొత్తం 8,90,534 కనెక్షలున్నాయి. వీటికి సంబంధించి ఏవైనా సమస్యలు వచ్చిన ఏఈఈలు వెళ్లాల్సిందే. వీటితో పాటు నూతన సర్వీసుల కోసం వినియోగదారులు, రైతులు కచ్చితంగా సంబంధిత కార్యాలయాలకు వెళ్లాల్సి ఉంటుంది. అయితే స్థానికంగా అధికారులు లేకపోవడంతో రైతులు, వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు.

జూనియర్ ఇంజనీర్లే దిక్కు

జిల్లాలో ఏఈఈల కొరత కారణంగా ఉన్నతాధికారులు ఇన్‌చార్జ్‌లతోనే నెట్టుకొస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 68 ఏఈఈ పోస్టులు ఉంటే అందులో 20 ఖాళీగా ఉన్నాయి. వీటిలో 12మంది జూనియర్ ఇంజనీర్లు ఇన్‌చార్జులుగా పనిచేస్తుండటం గమనార్హం. ఏఈఈ లేకపోవడంతో ఉన్నతాధికారులు చాల చోట్ల జూనియర్ ఇంజనీర్లకు అదనపు బాధ్యత లు అప్పగించి పనులు చేయించుకుంటున్నారు. వాస్తవానికి జూనియర్ ఇంజనీర్లు డివిజన్, సబ్ డివిజన్ కార్యాలయాల్లో పనిచేయాల్సి ఉంటుంది. జూనియర్ ఇంజనీర్లు తమ విధులు నిర్వర్తిస్తూనే స్థానిక సెక్షన్ పర్యవేక్షణ చేయాల్సి ఉంటుంది. వీరికే ఇన్‌చార్జ్ ఏఈఈ బాధ్య తలు అప్పగించారు. కొంత మంది ఏఈఈలు తాము పనిచేసే సెక్షన్‌తో పాటు ఇన్‌చార్జ్‌గా విధులు నిర్వహిస్తున్న సెక్షన్‌లోని వాటిని పర్యవేక్షించాల్సిన పరిస్థితి నెలకొంది. ఈక్రమంలో రోజువారిగా ఉన్నతా ధికారులు నిర్వహించే టెలీకాన్ఫరెన్స్‌లు, ప్రజాప్రతినిధుల సమావేశాలు, క్షేత్రస్థాయిలో సమస్యల పరిష్కారం ఇతరత్రవాటితో తలమునకలవు తున్నారు. ఒక్కొక్క ఏఈఈ 12వేల నుంచి 15వేల సర్వీసులను పర్యవేక్షించాల్సి ఉంది. అయితే ప్రస్తుతం 45వేల నుంచి 50వేల సర్వీసులను పర్యవేక్షించాల్సిన పరిస్థితి నెలకొంది.

సమస్యలు తలెత్తకుండా చర్యలు



జిల్లాలో ఏఈఈల కొరతను సంస్థ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ఏఈఈల కొరత కారణంగా ఆయా స్థానాల్లో సమీపంలోని ఏఈఈలు, జూనియర్ ఇంజనీర్లకు బాధ్యతలు అప్పగించాం. ఇదే క్రమంలోనే వినియోగదారులు, రైతులకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకున్నాం.

- శేషాద్రి శేఖర్, ఎస్ఈ, విద్యుత్తు శాఖ, అనంతపురం జిల్లా



జిల్లా కేంద్రంలోని డి-5 సెక్షన్ ఏఈఈ కార్యాలయం

అటవీ భూముల పరిరక్షణకు ప్రాధాన్యం

జిల్లా అటవీ శాఖాధికారి విఘ్నేష్



ఇంటర్వ్యూ interview

అనంతపురం న్యూటౌన్, మార్చి 21(ఆంధ్రజ్యోతి): అటవీ భూముల పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు జిల్లా అటవీ శాఖాధికారి (డీఎఫ్ఓ) విఘ్నేష్ పేర్కొన్నారు. జిల్లాలోని 94 రిజర్వ్ ఫారెస్ట్ (ఆర్ఎఫ్) బ్లాకులకు జియో ట్యాగింగ్ చేయించి, హద్దులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇప్పటి వరకు 88 బ్లాకులను పూర్తి చేశామన్నారు. అటవీస్థలాల్లోకి ఎవరూ అక్రమంగా ప్రవేశించకుండా చర్యలు చేపడతామంటున్న ఆయనతో 'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూ..

ప్రశ్న: వన్యప్రాణుల సంరక్షణకు ఎలాంటి చర్యలు చేపడుతున్నారు?

జవాబు: వేసవిలో వన్యప్రాణులు దాహంతో జనారణ్యంలోకి వస్తుంటాయి. వాటిని సంరక్షించడంలో భాగంగా సాసర్ పిట్స్‌లో ట్యాంకర్ల ద్వారా నీటిని నింపుతాం. జిల్లాలో 35 సాసర్ పిట్స్ ఉన్నాయి. సాసర్ పిట్స్ స్థానంలో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయించి, అక్కడ నీరు నిలువ ఉండేలా చర్యలు చేపడతాం. వన్యప్రాణులకు.. అడవిలోనే తగిన తిండి లభ్యమయ్యేలా ఫలాలను ఇచ్చే మొక్కలను పెంచుతాం.

ప్రశ్న: నర్సరీల అభివృద్ధికి ఎలాంటి చర్యలు చేపడుతున్నారు?

జవాబు: జిల్లాలో పచ్చదనం పెంపొందించే దిశగా చర్యలు చేపడుతున్నాం. నర్సరీల్లో 4.8 లక్షల మొక్కలు అందుబాటులోకి ఉంచేలా ఏర్పాట్లు చేస్తున్నాం. ప్రస్తుతం 3.8 లక్షల మొక్కలు అందుబాటులోకి వచ్చేలా విత్తనం సిద్ధం చేశాం. జూన్ నాటికి అన్నీ సమకూర్చేలా చర్యలు తీసుకుంటున్నాం.

ప్రశ్న: వన్యప్రాణుల నుంచి పంటలు నష్టపోతున్న రైతులను ఎలా ఆదుకుంటారు?

జవాబు: వన్యప్రాణుల నుంచి పంటలు నష్టపోతే సంబంధిత రైతుకు పరిహారం అందజేస్తాం. ఇప్పటి వరకు రూ.3 లక్షలు పరిహారం అందించాం. మరో రూ.1.5 లక్షలు చెల్లించాల్సి ఉంది. అర్హులైన వారికి త్వరలోనే పరిహారం అందిస్తాం.

ప్రశ్న: వేసవిలో అగ్ని నుంచి అడవులకు ఎలా రక్షిస్తారు?

జవాబు: జిల్లాలో అగ్ని నుంచి అడవులను కాపాడటం సవాల్‌గా మారింది. ఎన్ని జాగ్రత్తలు చేపట్టినా ఏదో ఒక ప్రాంతంలో అడవిలో అగ్ని పడతూనే ఉంది. వీటిని మానిటరింగ్ చేయడానికి వేసవిలో ప్రతి రేంజ్‌కు ప్రత్యేకంగా నలుగురు ఫైర్ వాచర్స్‌ను నియమించాం. వీరు గ్రామాల్లో తిరిగుతూ.. అడవిలోకి ఎవరు వెళ్తున్నారు, వారి వివరాలు నమోదు చేస్తున్నారు. అడవిలో ఎక్కడ అగ్ని పడినా సమాచారం ఇవ్వాలి. తద్వారా వెంటనే అదుపు చేసే అవకాశం ఉంటుంది.

వెంటనే విధుల్లో చేరాలి

అనుమతి లేకుండా దీర్ఘకాలిక సెలవులో వెళ్లడం సరికాదు

ఆ పోస్టును ఇతరులతో భర్తీ చేస్తాం

వైద్య సిబ్బందికి డీసీహెచ్ఎస్ హెచ్చరిక



రికార్డులను పరిశీలిస్తున్న డీసీహెచ్ఎస్

గుంతకల్లు, మార్చి21 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆస్పత్రుల్లో అనుమతులు తీసుకోకుండానే దీర్ఘకాలిక సెలవుపై వెళ్లినవారు వెంటనే విధుల్లో చేరాలని డీసీహెచ్ఎస్ పాల్ రవికుమార్ ఆదేశించారు. లేదంటే వారి స్థానంలో మరొకరిని నియమిస్తామని హెచ్చరించారు. స్థానిక ఏరియా ఆస్పత్రిని శుక్రవారం డీసీహెచ్ఎస్ తనిఖీచేశారు. అనుమతులు లేకుండా దీర్ఘకాలిక సెలవుపై వెళ్లిన వైద్యులు, సిబ్బందితో ఆయన ఫోన్‌లో మాట్లాడారు. నెలలకొద్దీ సెలవు ఇచ్చే అధికారం ఆస్పత్రి సూపరింటెండెంట్‌కు లేదన్నారు. తన అనుమతి లేకుండా ఇష్టానుసారంగా సెలవుపై వెళితే గుంతకల్లు లాంటి పెద్ద ఆస్పత్రిలో ఇబ్బందులు ఏర్పడతాయన్నారు. వెంటనే వచ్చి విధుల్లో చేరకుంటే ఇతరులను ఆ పోస్టుల్లో నియమిస్తామని స్పష్టంచేశారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. గుంతకల్లు ఏరియా ఆస్పత్రిలో బెడ్లు, సిబ్బందిని పెంచి జిల్లా ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేయడానికి ప్రభుత్వానికి సిఫారసు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి సూపరింటెండెంట్ అజేంద్రరావు పాల్గొన్నారు.

కూలిన వంతెనల పరిశీలన




దర్గాహొన్నూరు వద్ద వంతెనను పరిశీలిస్తున్న అధికారులు

బొమ్మనహాళ్/కణేకల్లు, మార్చి 21(ఆంధ్రజ్యోతి): బొమ్మనహాళ్, కణేకల్లు మండలాల పరిధిలోని దర్గాహొన్నూరు, మీనహళ్లి, మాల్యం గ్రామాల పరిధి 169, 165, 155 కి.మీ.ల వద్ద తుంగభద్ర ఎగువ కాలువపై కూలిన వంతెనలను అనంతపురం హెచ్చెల్సీ ఈఈ రమణారెడ్డి శుక్రవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. 105 కి.మీ. నుంచి 189 కి.మీ. వరకు 10 పనులకు రూ.34.95 కోట్లతో పనులు చేపడుతున్నామన్నారు. రెండు, మూడురోజుల్లో హెచ్చెల్సీ అత్యవసర పనులు ప్రారంభమవుతాయన్నారు. జూలై నాటికి పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో కణేకల్లు డీఈఈ మద్దిలేటి, జేఈఈ అల్తాఫ్ పాల్గొన్నారు.

అనంత అభివృద్ధికి మరిన్ని నిధులివ్వాలి

పార్లమెంటులో ఎంపీ అంబికా వినతి



మాట్లాడుతున్న ఎంపీ అంబికా

అనంతపురం అర్బన్, మార్చి 21(ఆంధ్రజ్యోతి): జిల్లా అభివృద్ధికి కేంద్రం మరిన్ని నిధులు కేటాయించాలని అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ కోరారు. శుక్రవారం పార్లమెంటులో జలశక్తి మంత్రిత్వ శాఖ కు మంజూరైన నిధులపై చర్చలో భాగంగా ఆయన మాట్లాడారు. 2025-26 బడ్జెట్‌లో జలశక్తి మంత్రిత్వశాఖకు రూ.99,503 కోట్లు కేటాయించడం హర్షణీయమన్నారు. అత్యల్ప వర్షపాతం నమోదయ్యే అనంత జిల్లాలో రైతులు తీవ్ర నీటి ఎద్దడితో ఇబ్బందులు పడుతున్నారన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని, ఈ ప్రాంత అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యమివ్వాలన్నారు. డ్రిప్, స్ప్రింక్లర్లపై సబ్సిడీ పెంచాలని కోరారు. అనంతపురాన్ని గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌గా అభివృద్ధి చేసేందుకు ప్రత్యేకంగా ప్రత్యేక నిధులివ్వాలన్నారు. రైతులకు ఉచితంగా సోలార్ పంపులను అందించే అవకాశాలను పరిశీలించాలని ఎంపీ కోరారు.

నేడు జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశాలు

అనంతపురం విద్య, మార్చి 21(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి అనంతపురం జిల్లా పరిషత్ స్టాండింగ్ కమిటీ సమావేశాలు శనివారం నిర్వహించనున్నట్లు జడ్పీ సీఈఓ రామచంద్రారెడ్డి ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10 గంటలకు జడ్పీ సమావేశ మందిరంలో ఆర్థిక, ప్రణాళిక సంఘం, వర్కులు, గ్రామీణాభివృద్ధి, విద్య, వైద్యసేవలు స్టాండింగ్ కమిటీ సమావేశాలు ఉంటాయన్నారు. అదనపు సమావేశ మందిరంలో మహిళా, శిశుసంక్షేమం, వ్యవసాయం, సాంఘిక సంక్షేమం స్టాండింగ్ కమిటీ సమావేశాలు నిర్వహించనున్నట్లు సీఈఓ తెలిపారు.

పోలీసుల అదుపులో నకిలీ నోట్ల ముఠా

బ్రహ్మసముద్రం, మార్చి 21(ఆంధ్రజ్యోతి): నకిలీ నోట్లు చెలామణి చేస్తున్న ముగ్గురిని బ్రహ్మసముద్రం పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. మండలంలోని పిల్లలపల్లికి చెందిన ఇద్దరు వ్యక్తులు రూ.50 వేల విలువైన నకిలీ నోట్లను కర్ణాటక ప్రాంతానికి చెందిన మొక్కజొన్న వ్యాపారికి అంటగట్టినట్లు తెలిసింది. కర్ణాటక వ్యాపారి వద్ద నకిలీ నోట్లు ఉన్నట్లు సమాచారం అందడంతో అతడిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించినట్లు తెలిసింది. అతడిచ్చిన సమాచారం మేరకు పిల్లలపల్లికి చెందిన ఇద్దరిని అదుపులోకి తీసుకుని, విచారిస్తున్నట్లు సమాచారం. సుమారు రూ.50 లక్షలకు పైబడి నకిలీ నోట్లు ఉన్నట్లు తెలుస్తోంది.

యువతకు ఉపాధి శిక్షణ

అనంతపురం క్లాక్‌టవర్, మార్చి 21(ఆంధ్రజ్యోతి): దీన్‌దయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ కౌసల యోజన కింద నిరుద్యోగ యువతీ యువకులకు స్వయం ఉపాధి కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు నిహార్‌స్కిల్స్ అడ్మిషన్ల సమన్వయకర్త హరిప్రసాద్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్, జూనియర్ సాఫ్ట్‌వేర్ డెవలపర్, బ్యూటీషియన్, స్పోకెన్ ఇంగ్లిష్, లైఫ్ స్కిల్స్‌పై నాలుగు నెలలపాటు కడపలో ఉచిత శిక్షణ ఇస్తామన్నారు. వివరాలకు 9000487423 నంబరులో సంప్రదించాలని కోరారు.

దేవేరుల అలక తీర్చిన శ్రీవారు

ఆకట్టుకున్న అలకోత్సవం

అశ్వవాహనంపై ఖాద్రీశుడి దర్శనం



అశ్వవాహనంపై ఊరేగుతున్న శ్రీవారు

కదిరి, మార్చి 21(ఆంధ్రజ్యోతి): లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలలో భాగమైన అలకోత్సవాన్ని శుక్రవారం రాత్రి కన్నుల పండువగా నిర్వహించారు. ఈ ఉత్సవాన్ని ఆలయ ఈఓ, ఉపకమిషనర్ వి. శ్రీనివాసరెడ్డి నివాసం వద్ద నిర్వహించారు. కల్యాణోత్సవం నాటి నుంచి రోజుకో వాహనంపై ఊరేగుతూ భక్తులను తప్ప తమను పట్టించుకో వడం లేదంటూ శ్రీదేవీ, భూదేవీ అమ్మవార్లు అలక పాన్పు ఎక్కడం, వారిని శ్రీవారు అనుయించే ఘట్టాలే అలకోత్సవం. అమ్మవార్ల తరుపున ఈఓ వకాల్తాపుచ్చుకోగా శ్రీవారు, అమ్మవార్ల మధ్య సంభాషణను ఆలయ అర్చకులు భక్తులకు వినిపించడం ఈ ఉత్సవ ప్రత్యేకత. సృష్టిలో సర్వమూ తానేనని, లోకకల్యాణార్థమే తాను భక్తుల చెంతకు వెళ్తున్నాని, శ్రీవారు నచ్చచెప్పడంతో అమ్మవార్లు శాంతించి యాగశాల ప్రవేశం గావించారు. ఈ ఉత్సవానికి ఆలయ ఈఓ ఉభయదారులుగా వ్యవహరించి శ్రీవారు, అమ్మవార్లకు పట్టు వస్త్రాలను సమర్పించారు. పట్టణంలోని ప్రముఖులతో పాటు పెద్ద ఎత్తున భక్తులు ఈ ఉత్సవాన్ని వీక్షించారు. అలకోత్సవం అనంతరం శ్రీవారు అశ్వవాహనంపై కొలువుతీరి మాడవీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. పదిహేను రోజుల పాటు నిర్వహించిన బ్రహ్మోత్సవాలు విజయవంతం అయ్యాయని చాటి చెప్పేందుకే శ్వేత అశ్వ వాహనం పై దర్శనమిచ్చారు.

నేడు తీర్థవాది

లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం తీర్థవాది జరగనుంది. ఉత్సవాలకు అంకురార్పణ జరిగిన నాటి నుంచి యాగశాలలోనే కొలువు తీరిన శ్రీవారు శనివారం ఆలయప్రవేశం చేయనున్నారు. ఈ ఉత్సవంలో భాగంగా ఉదయం నిత్య పూజల అనంతరం శ్రీదేవి, భూదేవిల సమేత శ్రీవారు ఆలయప్రాంగణంలో కొలువుతీరుతారు. ఈ సందర్భంగా అధికారులు, ఉద్యోగులు, భక్తులు అన్న భేదం లేకుండా అందరూ రంగులు చల్లుకుని వసంతోత్సవాలు జరుపుకుంటారు. అనంతరం దేవేరుల సమేత శ్రీవారిని ఆలయానికి పడమర దిక్కున ఉన్న భృగుతీర్థం వరకు ఊరేగిస్తారు. వేదపండితుల మంత్రోచ్ఛారణల నడుమ భృగుతీర్థంలో శ్రీచక్ర స్నానం, అభిషేకాలు నిర్వహించిన అనంతరం తిరువీధుల గుండా ఆలయ ప్రవేశం గావిస్తారు. అనంతరం ప్రధాన ద్వారాలు మూసివేసి అన్నిరకాల దర్శనాలను రద్దు చేస్తారు. పునః దర్శనం ఆదివారం ఉదయమే.

తాడిపత్రిలో ఉద్రిక్తత

వైసీపీ నాయకుడు ఫయాజ్‌బాషా ఇంటి నిర్మాణంపై వివాదం

అనుమతి లేదని కూల్చి వేసేందుకు వెళ్లిన మున్సిపల్ అధికారులు

కోర్టు పరిధిలో ఉందని అభ్యంతరం చెప్పిన ఫయాజ్‌బాషా

జేసీ ప్రభాకర్ రెడ్డి అక్కడికి వెళ్లడంతో వాగ్వాదం

ఫయాజ్ ఇంటిపై రాళ్లదాడి.. వాహనం ధ్వంసం



అడిషినల్ ఎస్పీతో మాట్లాడుతున్న జేసీ ప్రభాకర్ రెడ్డి



ఫయాజ్‌బాషా ఇంటి నిర్మాణాన్ని కూల్చివేయడానికి తీసుకువచ్చిన హిటాచి

తాడిపత్రి, మార్చి 21(ఆంధ్రజ్యోతి): పట్టణంలో శుక్రవారం ఉద్రిక్తత తలెత్తింది. వైసీపీ రాష్ట్ర కార్యదర్శి, మున్సిపల్ కౌన్సిలర్ ఫయాజ్‌బాషా అనుమతికి మించి ఇంటిని నిర్మించారని కూల్చివేసేందుకు మున్సిపల్ అధికారులు వెళ్లారు. వారితోపాటు మున్సిపల్ కౌన్సిలర్లు కొందరు వెళ్లారు. ఈ క్రమంలో వాగ్వాదం జరగడం, మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి అక్కడికి వెళ్లడంతో పరిస్థితి అదుపు తప్పింది. ఫయాజ్ బాషా ఇంటిపై రాళ్ల దాడి జరిగింది. తాడిపత్రి చిన్నబజారులో ఫయాజ్ బాషా ఇల్లు నిర్మించారు. కానీ అనుమతి తీసుకున్న ప్లాన్‌కంటే ఎక్కువ నిర్మాణం చేపట్టారని మున్సిపల్ అధికారులు, టీడీపీ కౌన్సిలర్లు ఎక్స్‌కవేటర్‌తో కూల్చివేసేందుకు వెళ్లారు. తనకు అన్ని అనుమతులు ఉన్నాయని, కోర్టును కూడా ఆశ్రయించానని ఫయాజ్ అభ్యంతరం తెలిపారు. పై అంతస్తుకు మాత్రమే అనుమతి లేదని, అనుమతి కోరానని అన్నారు. అలాంటప్పుడు తన ఇంటిని ఎలా కూల్చివేస్తారని ఆయన ప్రశ్నించారు. కోర్టు ఇచ్చిన పత్రాలను వారికి చూపించారు. వివాదం నేపథ్యంలో అడిషనల్ ఎస్పీ రోహిత్ కుమార్ చౌదరి పోలీసు సిబ్బందితో అక్కడికి చేరుకున్నారు. ఇరువర్గాల వాదన విని, కోర్టు పరిధిలో ఉన్నందునూ ఎవరూ ఏమీ చేయవద్దని సూచించారు. దీనికి మున్సిపల్ అధికారులు ఒప్పుకోలేదు. ప్లాన్ అనుమతులు తక్కువగా తీసుకున్నాడని, ఇలాగే విడిచిపెడితే ఎలా అని ఏఎస్పీతో వాదించారు. కోర్టు పరిధిలో ఉండగా నిర్మాణాన్ని ఎలా పూర్తిచేస్తారని, ఇంట్లోకి ఎలా చేరుతారని మున్సిపల్ అధికారులు ఫయాజ్‌బాషాను ప్రశ్నించారు. ఇకపై ఎలాంటి పనులు చేయబోమని రాసివ్వాలని కోరారు. దీనికి ఆయన నిరాకరించారు. ఈ క్రమంలో రెండు వర్గాలవారు జనసమీకరణ చేసుకున్నారు. దీంతో పోలీసులు నచ్చజెప్పి చాలామందిని అక్కడి నుంచి పంపించివేశారు. ఆ తరువాత మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి వస్తాడని మున్సిపల్ అధికారులు, కౌన్సిలర్లు అక్కడే మకాం వేశారు. కాసేపటికి జేసీ ప్రభాకర్‌రెడ్డి అక్కడికి రావడంతో ఒక్కసారిగా ఉద్రిక్తత ఏర్పడింది. పోలీసులు అప్రమత్తమై ఇరువర్గాలతో మాట్లాడినా ప్రయోజనం లేకపోయింది. మాటమాట పెరగడంతో ఫయాజ్ బాషా ఇంటిపైకి ఒక్కసారిగా రాళ్ల వర్షం కురిపించారు. దీంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. పరిస్థితి చేయి దాటిపోవడంతో ఫయాజ్‌బాషాను పోలీసులు జీపులో తీసుకొని స్టేషన్‌కు తరలించారు. ఈ దాడుల్లో ఫయాజ్‌బాషా ఇంటి అద్దాలు పగిలిపోయాయి. ఆయన వాహనం ధ్వంసమైంది. దాడి అనంతరం పోలీసులు జేసీ ప్రభాకర్‌రెడ్డి, ఆయన వర్గీయులను అక్కడి నుంచి పంపించివేశారు. ముందుజాగ్రత్త చర్యగా పెద్దవడుగూరు, యాడికి, పుట్లూరు సీఐలు, ఎస్‌ఐలు, సిబ్బందిని తాడిపత్రికి రప్పించారు. తాడిపత్రి పట్టణ సీఐ సాయిప్రసాద్, రూరల్ సీఐ శివగంగాధర్‌రెడ్డి ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

మెడికల్ షాపులపై దాడులు

ప్రిస్క్రిప్షన్ లేకుండా అమ్ముతున్నట్లు గుర్తింపు

చర్యలకు సిఫార్సు చేస్తామన్న విజిలెన్స్ అధికారులు



అనంతపురంలోని ఉమాదేవి మెడికల్ షాపులో తనిఖీలు



హిందూపురంలోని మెడికల్‌షాపులో తనిఖీలు నిర్వహిస్తున్న ఈగల్ టీం

అనంతపురం టౌన్/హిందూపురం, మార్చి 21(ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ గరుడలో భాగంగా ఉమ్మడి జిల్లాలో మెడికల్ ఏజెన్సీలు, దుకాణాలపై విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం ఐజీ రవిప్రకాష్, ఈగల్ టీం ఆధ్వర్యంలో శుక్రవారం దాడులు నిర్వహించారు. విజిలెన్స్ డీఎస్పీ నాగభూషణం, సీఐలు జమాల్ బాషా, సద్గురుడు, ఏఓ వాసుప్రకాష్, డీసీటీఓ సురేష్‌కుమార్, డ్రగ్స్ శాఖ అసిస్టెంట్ డైరెక్టరు రమేష్ రెడ్డి బృందంగా ఏర్పడి దాడులు నిర్వహించారు. అనంతపురం నగరంలోని ఉమాదేవి, న్యూ సుభాన్, కేశవ్, రూపా మెడికల్ షాపులలో తనిఖీలు చేశారు. ఈ దుకాణాలలో ఎన్ఆర్ఎక్స్ (మత్తు కలిగించేవి) మందులను నిబంధనలకు విరుద్ధంగా అమ్ముతున్నట్లు గుర్తించారు. డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండా వీటిని విక్రయించకూడదు. కానీ రోగులు నేరుగా వచ్చి అడిగినా వీటిని అమ్ముతున్నట్లు గుర్తించామని డీఎస్పీ నాగభూషణం, డ్రగ్స్‌శాఖ అసిస్టెంట్ డైరెక్టరు రమేష్ రెడ్డి తెలిపారు. ఈ దుకాణాలపై చర్యలకు సిఫార్సు చేస్తామని తెలిపారు. శ్రీసత్యసాయి జిల్లా హిందూపురంలోని మెడికల్ షాపులు, ఏజెన్సీలపై దాడులు నిర్వహించారు. ప్రభుత్వ ఆసుపత్రి సమీపంలో ఉన్న నాగశ్రీ మెడికల్‌షాపులో కాలం చెల్లిన మందులను అమ్ముతున్నట్లు గుర్తించారు. వైద్యుల ప్రిస్క్రిప్షన్ లేకుండానే మత్తు మందులను అమ్ముతున్నట్లు గుర్తించారు. ఈ మెడికల్ షాపును సీజ్ చేయాలని ఉన్నతాధికారులకు సిఫార్సు చేస్తామని విజిలెన్స్ సీఐ సద్గురుడు తెలిపారు. పెనుకొండలోని రెండు ప్రధాన మెడికల్ షాపుల్లో బిల్లులు లేకుండా మందులు ఇస్తున్నట్లు గుర్తించారు. వీరికి జరిమానా విధించాలని నివేదిక పంపుతామని సీఐ తెలిపారు.

జిల్లాలో ఆధ్యాత్మిక నగరం

50 ఎకరాల్లో నిర్మాణానికి నిర్ణయం

300 అడుగుల శివలింగం.. 108 అడుగుల విష్ణుమూర్తి విగ్రహం

3 నెలల్లో శంకుస్థాపన.. ఐదేళ్లలో నిర్మాణం

ఆధ్యాత్మిక మందిరాల రూపకర్త డీఎన్‌వీ ప్రసాద్ స్తపతి



మాట్లాడుతున్న డీఎన్‌వీ ప్రసాద్ స్తపతి

అనంతపురం కల్చరల్, మార్చి 21(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఆధ్యాత్మిక నగరం నిర్మాణానికి చర్యలు చేపడుతున్నట్లు ఆధ్యాత్మిక మందిరాల రూపకర్త డీఎన్‌వీ ప్రసాద్ స్తపతి తెలిపారు. జిల్లాను సనాతన సిద్ధాంతాలకు వేదికగా మారుస్తూ నార్పల క్రాస్ వద్ద 50 ఎకరాల విస్తీర్ణంలో ఆధ్యాత్మిక నగరాన్ని రూపొందించనున్నట్లు పేర్కొన్నారు. దీనిపై జిల్లాకేంద్రంలోని సాయికృష్ణ ఫంక్షన్ హాల్‌లో ఆధ్యాత్మిక సంఘాల ప్రతినిధులతో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. డీఎన్‌వీ ప్రసాద్ స్తపతి మాట్లాడుతూ.. దేశంలో సనాతన ధర్మానికి స్వర్ణయుగం ప్రారంభమైందన్నారు. ప్రపంచం భారతదేశం వైపు చూసేలా ఆధ్యాత్మిక మందిరాల స్థాపన జరుగుతోందన్నారు. ఇందులో భాగంగా నార్పల క్రాస్ వద్ద 300 అడుగుల ఎత్తులో పంచముఖ శివలింగం, 108 అడుగుల ఎత్తుగల శ్రీమహావిష్ణుమూర్తి విగ్రహం ఏర్పాటు చేయదలిచామన్నారు. ఆలయాల నిర్మాణం, అభివృద్ధికి ప్రభుత్వాలు ముందుకు వస్తుండడం శుభపరిణామమన్నారు. ఆధ్యాత్మిక సంఘాలతోపాటు భక్తుల సమన్వయంతో నార్పల క్రాస్ వద్ద ఆధ్యాత్మిక నగరం ఏర్పాటుకోసం 50 ఎకరాల స్థలాన్ని సమీకరించామన్నారు. అందులో 25 ఎకరాల విస్తీర్ణంలో హరిహర మందిరం ఉంటుందన్నారు. గ్రామం-గుడి-బడి అనే సంకల్పంతో దీనిని చేపట్టినట్లు తెలిపారు. మందిరం కాకుండా మిగిలిన స్థలంలో ఆధ్యాత్మిక భావజాల భక్తుల నివాసాలు, హిందూ సనాతన ధర్మంతో కూడిన విద్యను అందించేలా పాఠశాల నిర్మాణాలు చేపడతామన్నారు. పాఠశాలలో సాధారణ పాఠాలతోపాటు భగవద్గీత, భాగవతం వంటివి బోధిస్తామన్నారు. 3 నెలల్లోపు శంకుస్థాపన చేసి, ఐదేళ్లలో మొత్తం నిర్మాణాన్ని పూర్తి చేసేలా ప్రణాళిక రూపొందించామన్నారు. కార్యక్రమంలో తిరుపతి గోవింద పీఠం రామప్రియ యతీంద్రస్వామి, శ్రీనివాస్ స్తపతి, పెంచల ప్రసాద్ స్తపతి, ఇస్కాన్ మందిర చైర్మన్ దామోదర్ గౌరంగదాస్, టీటీడీ హిందూధర్మప్రచార పరిషత్ సభ్యుడు శ్రీపాద వేణు, చాంబర్ ఆఫ్ కామర్స్ కార్యదర్శి రంగారెడ్డి పాల్గొన్నారు.

ఒకే పోస్టుకు ఇద్దరు అధికారులు..!

అనంతపురం క్లాక్‌టవర్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ఒకే పోస్టుకు ఇద్దరు అధికారులను నియమించారు. దీంతో ఆన్‌సెట్ సీఈఓ అధికారి నియామకం వివాదంగా మారింది. జీఓ నంబరు 61ను రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శి వినయచంద్ శుక్రవారం జారీ చేశారు. ఉత్తర్వుల ప్రకారం వెయిటింగ్‌లో ఉన్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రవిశంకర్ రెడ్డిని అనంతపురం ఆన్‌సెట్ సీఈఓ, జిల్లా యువజన సంక్షేమశాఖ అధికారిగా నియమించారు. మరోవైపు టూరిజం రీజనల్ డైరెక్టర్‌గా ఉన్న వెంకటేశ్వర్లుకు ఆన్‌సెట్ సీఈఓ, జిల్లా యువజన సంక్షేమశాఖ అధికారిగా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్ గత అక్టోబరులోనే ఉత్తర్వులు జారీ చేశారు. కాగా యూత్ కల్చరల్ స్పోర్ట్స్ డిపార్ట్‌మెంట్ ప్రధాన కార్యదర్శి వినయ్‌చంద్ రెండో సారి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేయడం గమనార్హం. దీంతో ఈ పోస్టులో ఇప్పటికే ఉన్న వెంకటేశ్వర్లు కొనసాగుతారా లేక కొత్తగా ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల మేరకు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రవిశంకర్ రెడ్డి చేరుతారా అన్న విషయంలో ఉత్కంఠ నెలకొంది.

మీ సేవలు అమూల్యం..!

ఉమ్మడి జిల్లాలో పలువురికి ఉగాది పురస్కారాలు

జాబితాలో పోలీసు, ఫైర్, విజిలెన్స్ అధికారులు, సిబ్బంది



విజిలెన్స్ డీఎస్పీ నాగభూషణం



స్పెషల్ బ్రాంచ్ సీఐ ధరణికిషోర్



ఇటుకలపల్లి సీఐ హేమంత్‌కుమార్

అనంతపురం క్రైం/పుట్టపర్తి, మార్చి 21(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని పలువురు అధికారు లు, సిబ్బందిని రాష్ట్ర ప్రభుత్వం ఉగాది పురస్కారాలకు ఎంపిక చేసింది. పోలీసు, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, అగ్నిమాపక శాఖ అధికారులు, సిబ్బందికి ఉత్తమ సేవా పతకాలు, సేవా పతకాలు వరించాయి.

ఉత్తమ సేవా పతకాలు

విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీఎస్పీ ఎం.నాగభూషణం, అనంతపురం జిల్లా స్పెషల్ బ్రాంచ్ ఎస్‌ఐ జి.లోక్‌నాథ్‌చౌదరి, శ్రీసత్యసాయి జిల్లా గాండ్లపెంట ఎస్‌ఐ కోటకొండ రామమోహన్, 14వ బెటాలియన్ ఏఆర్ ఎస్‌ఐ వీసీఎస్ మహారాజు, 14వ బెటాలియన్ హెడ్ కానిస్టేబుల్ వి.నారాయణస్వామి, అనంతపురం జిల్లా ఫైర్‌స్టేషన్ డ్రైవర్ ఆపరేటర్ ఎం.నాగభూషణం ఉత్తమ సేవా పతకాలకు ఎంపికయ్యారు.

సేవా పతకాలు

అనంతపురం జిల్లా స్పెషల్ బ్రాంచ్ సీఐ కె.ధరణి కిషోర్, ఇటుకలపల్లి సీఐ హేమంత్ కుమార్, శ్రీసత్యసాయి జిల్లా కదిరి రూరల్ అప్‌గ్రేడ్ పోలీస్ స్టేషన్ ఎస్‌ఐ ఎన్.రమణారెడ్డి, శ్రీ సత్యసాయి జిల్లా ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ గోకులం విజయ్‌కుమార్, రొళ్ల పోలీస్‌స్టేషన్ ఏఎస్‌ఐ బి.చిన్న బాలాజి, ఏఆర్ ఎస్‌ఐ ఎస్.షౌకత్ అలి, శ్రీ సత్యసాయి జిల్లా డీసీఆర్‌బీ ఏఎస్‌ఐ నాచు సంజీవకుమార్, కదిరి రూరల్ అప్‌గ్రేడ్ పోలీస్‌స్టేషన్ ఏఎస్‌ఐ అగస్టెన్ పాల్, ఎన్‌పీ కుంట పీఎస్ ఏఎస్‌ఐ ఎన్.మునే నాయక్, అనంతపురం జిల్లా ఏఆర్ ఎస్‌ఐ సీహెచ్ నాగేశ్వరరావు, పుట్లూరు పీఎస్ ఏఎస్‌ఐ పి.రాజశేఖర్, ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ ఎ.నాగరాజు, కళ్యాణదుర్గం టౌన్ పీఎస్ హెడ్‌కానిస్టేబుల్ ఎం.హరినాథ్‌బాబు, అనంతపురం రూరల్ పీఎస్ కానిస్టేబుల్ టిప్పుసుల్తాన్, ఉరవకొండ యూపీఎస్ కానిస్టేబుల్ ఎం.చంద్రశేఖర్, ఏఆర్ పీసీ సి.రాముడు, అనంతపురం జిల్లా స్పెషల్ బ్రాంచ్ కానిస్టేబుల్ ఏ.ప్రసన్నకుమార్, 14వ బెటాలియన్ ఏఆర్ ఎస్‌ఐ కె.వెంకటరామయ్య, ఏఆర్ఎస్‌ఐ ఎస్.రామక్రిష్ణ, 14వ బెటాలియన్ హెడ్‌కానిస్టేబుల్ బి.కోటేశ్వరరావు, ఏఆర్ ఎస్‌ఐ టి.హరినంద, హెడ్ కానిస్టేబుల్ కె.కన్నయ్య, పీటీసీ ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ బి.పెద్ద రంగయ్య సేవా పతకాలకు ఎంపికయ్యారు. అగ్నిమాపక శాఖలో సేవా పతకానికి ఉరవకొండ ఫైర్ స్టేషన్ లీడింగ్ ఫైర్‌మాన్ లక్ష్మీనారాయణ, శ్రీసత్యసాయి జిల్లా అసిస్టెంట్ ఫైర్ ఆఫీసర్ హేమంత్‌రెడ్డి, పెనుకొండ ఫైర్‌స్టేషన్ లీడింగ్ ఫైర్‌మాన్ సీవీ రంగనాథమ్ ఎంపికయ్యారు.

ఏపీ పోలీస్ సేవా పతకం

విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ హెడ్‌కానిస్టేబుల్ బీఎన్ చలం బాబు ఏపీ పోలీస్ సేవా పతకానికి ఎంపికయ్యారు.

కారులో లిఫ్ట్ ఇచ్చి.. కత్తితో బెదిరించి..!

కియ కారు డ్రైవర్‌ను దోచుకున్న తెలంగాణ యువకులు

పారిపోతుండగా పట్టుకున్న పోలీసులు



నిందితులు ఉపయోగించిన కారు

గోరంట్ల, మార్చి 21(ఆంధ్రజ్యోతి): కియలో పని చేసే కారు డ్రైవర్‌కు లిఫ్ట్ ఇచ్చిన తెలంగాణ యువకులు, అతన్ని కత్తితో బెదిరించి దోచుకున్నారు. కారులో పారిపోతుండగా టోల్ గేట్ వద్ద పోలీసులు పట్టుకున్నారు. గోరంట్ల మండలం పాలసముద్రం సమీపంలో బుధవారం రాత్రి జరిగిన ఈ సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గోరంట్ల మండలం పుల్లగూర్లపల్లికి చెందిన నందకూమార్ కియ పరిశ్రమలో కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. విధులకు వెళ్లేందుకు బుధవారం రాత్రి పాలసముద్రం కూడలిలో వేచి ఉన్నారు. అదే సమయంలో బెంగుళూరు వైపు నుంచి టీఎస్ 21 ఎఫ్0092 నంబర్‌గల కారు రావడంతో నందకుమార్ లిఫ్ట్ అడిగారు. వారు కారులో ఎక్కించుకుని, సోమందేపల్లి సమీపంలోని పాపిరెడ్డిపల్లి చెరువు వద్దకు తీసుకెళ్లారు. అక్కడ రోడ్డు పక్కన కారు ఆపి, నందకుమార్‌ను దూరంగా తీసుకెళ్లి కత్తితో బెదిరించారు. బ్యాగ్ లాకుని, డబ్బులు డిమాండ్ చేశారు. అతని వద్ద నగదు లేకపోవడంతో 'కారు ప్రమాదం జరిగిందని చెప్పి మీ బంధువులకు చెప్పి ఫోన్ పే చేయించుకో' అని సూచించారు. అలా పలువురు బంధువుల నుంచి నందకుమార్ ఫోన్‌పే చేయించుకున్న సొమ్మును డబ్బు లాగేసుకున్నారు. నందకుమార్ వద్ద రెండు ఏటీఎం కార్డులు ఉండటంతో.. డబ్బులు డ్రా చేయించడానికి కారులో కియ సమీపంలోని అమ్మవారిపల్లి ఏటిఎం వద్దకు తీసుకెళ్లారు. అలా మొత్తం రూ.75 వేలు దోచుకుని, ఏటీఎం వద్ద చర్చించుకుంటున్నారు. ఆ సమయంలో నందకూమార్ చాకచక్యంగా తప్పించుకుని ఏటీఎం సెక్యూరిటీ గార్డు వద్దకు పరుగులు తీశారు. దీంతో నలుగురు యువకులు వెంటనే కారులో ఎక్కి ఉడాయించారు. బాధితుడు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో అనంతపురం జిల్లా మరూర్ టోల్ గేట్ వద్ద కారును గుర్తించి, నలుగురినీ పోలీసులు పట్టుకున్నారు. బాధితుడిని టోల్‌గేట్ వద్దకు పిలిపించి విచారించారు. ఆ యువకులు నలుగురూ తెలంగాణలోని జగిత్యాలకు చెందినవారని తేలింది. గోవాకు వెళ్లి డబ్బులన్నీ ఖర్చు చేశారని, అందుకే తిరుగు ప్రయాణంలో నందకుమార్‌ను దోచుకున్నారని తెలిసింది. కేసు నమోదు చేసుకుని విచారిస్తున్నామని గోరంట్ల సీఐ శేఖర్ తెలిపారు. పూర్తి వివరాలు త్వరలో వెల్లడిస్తామని తెలిపారు.

9 మంది ఎన్నికల అధికారుల నియామకం

అనంతపురం విద్య, మార్చి 21(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో ఖాళీ అయిన ఎంపీపీ, వైస్ ఎంపీపీ స్థానాలకు ఎన్నికల నిర్వహణ నిమిత్తం రెండు జిల్లాల కలెక్టర్లు ఎన్నికల అధికారులను నియమించారు. మొత్తం 9 మందిని నియమించారు. కణేకల్లు మండలానికి రిజిస్ట్రార్ భార్గవ్, కంబదూరుకు ఆత్మా పీడీ మద్దిలేటి, ఉరవకొండకు బీసీ వెల్ఫేర్ అధికారి కుష్బూకొఠారి, యల్లనూరుకు జిల్లా హార్టికల్చర్ అధికారి రఘునాథరెడ్డి, పెద్దపప్పూరుకు డిప్యూటీ డైరెక్టర్ ప్రభాకర్ రెడ్డి, రాయదుర్గానికి జిల్లా పరిశ్రమల శాఖ జీఎం శ్రీనివాసయాదవ్, గాండ్లపెంట మండలానికి ఏపీఎంఐపీ పీడీ సుదర్శన్, రొద్దంకి డ్వామా పీడీ విజయప్రసాద్, రామగిరికి ఆర్అండ్‌బీ ఎస్ఈ సంజీవయ్యను నియమించారు. ఈనెల 27న జిల్లావ్యాప్తంగా ఐదు ఎంపీపీ, నాలుగు వైస్ ఎంపీపీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించనున్నారు.

ముంచేసిన మునగ..!

- పడిపోయిన ధరలు
- కొనేందుకు ముందుకురాని వ్యాపారులు
- పొలాల్లోనే పంటను వదిలేస్తున్న రైతులు

శింగనమల, మార్చి 21(ఆంధ్రజ్యోతి): మునగ పంట రైతులకు నష్టాలు మిగులుస్తోంది. దిగుబడి ఆశాజనకంగా ఉన్నా ధర లేకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఓ వైపు ఎండల తీవ్రత పెరగడంతో చెట్లు ఎండిపోతున్నాయి. కాయల నాణ్యత లోపించడంతో వ్యాపారులు కొనేందుకు ముందుకు రావడం లేదు. మండలంలో పెరవలి, జూలాకాలువ, పెద్దజలాలపురం, నాయనవారిపల్లి, సలకంచెరువు గ్రామాల్లో 500 ఎకరాల్లో మునగ పంటను రైతులు సాగుచేశారు. బిందు, తుంపర సేద్యం పద్ధతిలో పంట సాగుచేస్తున్నారు. గత ప్రభుత్వం రాయితీపై బిందు సేద్య పరికరాలు అందివ్వలేదు. రైతులే సొంత ఖర్చుతో కొనుగోలు చేయడంతో అదనపు భారమైంది. మరోవైపు పంట దిగుబడి వచ్చే సమయంలో దళారుల మాయాజాలంతో ధరలు పడిపోవడంతో రైతులు నష్టాల ఊబిలో కూరుకుపోతున్నారు.

పెట్టుబడులు వచ్చే పరిస్థితి లేదు

మునగ పంట సాగు చేసేందుకు ఎకరాకు రూ.లక్ష వరకు వస్తుంది.. గతంలో ధర బాగా ఉండటంతో కనీసం పెట్టుబడులు పోను అంతో ఇంతో వస్తుందనే ఆశతో రైతులు పంటను సాగుచేశారు. ప్రస్తుతం ధరలు పడిపోవడంతో రైతులకు కనీసం పెట్టుబడులు కూడా వచ్చేపరిస్థితి లేదు. విధిలేని పరిస్థితిలో పంటను తోటల్లోనే వదిలేస్తున్నారు.



మునగ చెట్లపైనే కాయలను వదిలేసిన దృశ్యం

కనీసం కూలీలకు చెల్లించేందుకు రూ.300 కూలి కూడా గిట్టుబాటుకావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జనవరిలో కిలో.. రూ.250.... ప్రస్తుతం రూ.ఐదే

మునగ పంటకు అమాంతం ధర పడిపోవడంతో రైతులకు దిక్కుతోచడం లేదు. జనవరిలో కిలో రూ.200 నుంచి రూ.250 వరకు ధర పలికింది. ఫిబ్రవరిలో రూ.100 నుంచి రూ.150 ఉండేది. మార్చికి వచ్చేసరికి రూ.5 పలకడంతో కనీసం కూలీలకు కూడా గిట్టుబాటుకావడం లేదని రైతులు అంటున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం: శైలజ, ఉద్యాన శాఖాధికారి

నియోజకవర్గంలో మునగపంటను ఎక్కువ మంది రైతులు సాగు చేశారు రెండు నెలల క్రితం ధర ఆశాజనకంగా ఉండేది. ఈ నెలలో ధర పతనం కావడంతో రైతులు నష్టపోతున్నారు. గిట్టుబాటు ధర కల్పించేందుకు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తాం.

గిట్టుబాటు ధర కల్పించాలి: రైతు నాగేంద్ర, జూలాకాలువ



4 ఎకరాల్లో మునగ పంట సాగు చేశాను. పంట దిగుబడులు బాగానే వచ్చాయి. పంటను కంటికి రెప్పలాగా కాపాడుకున్నాం. 20 రోజుల నుంచి కేజీ రూ.5 పలకడంతో పంటను పొలంలోనే వదిలేశా. ప్రభుత్వం స్పందించి మునగ కాయలకు గిట్టుబాటు ధర కల్పించాలి.

అప్పులే మిగిలాయి: రైతు ప్రకాశ్, పెరవలి



గతంలో మునగ పంటలు సాగుచేసి లాభాలు గడించాం. ఈసారి పంటలు సాగుచేస్తే అప్పులే మిగిలాయి. ఒక్కసారిగా ధరపడిపోవడంతో పెట్టుబడి కూడా రాని పరిస్థితి నెలకొంది. రైతులు తీవ్రంగా నష్టపోయారు. ప్రభుత్వమే ఆదుకోవాలి.

న్యూస్ బాక్స్

దుర్గమ్మ సన్నిధిలో పరిటాల కుటుంబం



పరిటాల కుటుంబ సభ్యులను ఆశీర్వదిస్తున్న అర్చకులు

అనంతపురం అర్బన్, మార్చి 21(ఆంధ్రజ్యోతి): విజయవాడ కనకదుర్గమ్మ అమ్మవారిని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, ఆమె కుటుంబ సభ్యులు దర్శించుకున్నారు. శుక్రవారం ఎమ్మెల్యే, ధర్మవరం ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ సతీమణి పరిటాల జ్ఞాన, ఇతర కుటుంబ సభ్యులు దుర్గమ్మ ఆలయానికి వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు పరిటాల కుటుంబ సభ్యులను ఆశీర్వదించారు.

అర్హులైన రైతులకు సబ్సిడీ పరికరాలు



సబ్సిడీ పైపులను పంపిణీ చేస్తున్న ఎల్ నారాయణచౌదరి

చెన్నేకొత్తపల్లి, మార్చి 21(ఆంధ్రజ్యోతి): అర్హులైన రైతులకు సబ్సిడీ కింద వ్యవసాయ పరికరాలు అందిస్తున్నట్లు టీడీపీ నాయకులు ఎల్ నారాయణచౌదరి తెలిపారు. జాతీయ నూనెగింజల అభివృద్ధి పథకం కింద నీటి సరఫరా పైపులు మంజూరు కాగా వాటిని శుక్రవారం ఆయన రైతులకు అందజేశారు. మండలంలోని పులేటిపల్లి, చెన్నేకొత్తపల్లి గ్రామాలకు చెందిన 15 మంది రైతులకు ఒక్కొక్క రైతుకు 71 పైపులను పంపిణీ చేశారు. ఏడీఏ క్రిష్ణయ్య, ఏఓ ఉదయ్‌కుమార్, రైతు సేవా కేంద్రం సిబ్బంది మారుతి, నాగేశ్వరమ్మ, టీడీపీ కన్వీనర్ ముత్యాల్‌రెడ్డి, దండు ఓబుళేశు పాల్గొన్నారు.

ఆటల్లోనూ అనంత మెడికోలు అదుర్స్



ప్రతిభచాటిన మెడికోలను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

అనంతపురం టౌన్, మార్చి 21(ఆంధ్రజ్యోతి): ఎంబీబీఎస్ విద్యతో పాటు అనంతమెడికల్‌కళాశాల మెడికోలు ఆట్లో అత్యత ప్రతిభకనబరిచి అదుర్స్ అనిపించారు. 8 నుంచి 17వ తేదీ వరకు విజయవాడలోని సిద్ధార్థమెడికల్ కళాశాలలో ఎన్టీఆర్ హెల్త్‌విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో అంతర కళాశాలల రాష్ట్రస్థాయి క్రీడోత్సవాలు నిర్వహించారు. పోటీలకు అనంత మెడికల్ కళాశాల మెడికోలు హాజరయ్యారు. వాలీబాల్, కబడ్డీ, చెస్, ఫుట్‌బాల్, టేబుల్ టెన్నిస్, టెన్నిస్ పోటీల్లో పాల్గొన్నారు. చెస్, టేబుల్‌టెన్నిస్ పోటీలలో ద్వితీయస్థానం సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టరు మాణిక్యాలరావు తెలిపారు. ప్రతిభచాటిన దీపక్, లోకేష్, శబరీష్, ఆనంద్, పూర్ణ, చిద్విలాస్, మనీష్, అగ్నేలు శుక్రవారం ప్రిన్సిపాల్‌తోపాటు వైస్ ప్రిన్సిపాల్ షారోన్ సానియా, ప్రొఫెసర్లు, డాక్టర్లు వరదరాజులు, మధుసూదన్, ఫిజికల్ డైరెక్టర్ నరసింహనాయక్ అభినందించారు.

ఆదరణ-3 బీసీలకు వరం

అనంతపురం అర్బన్, మార్చి 21(ఆంధ్రజ్యోతి): ఆదరణ-3 పథకం బీసీలకు వరమని పద్మశాలి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ పోతుల లక్ష్మీనరసింహులు అన్నారు. శుక్రవారం స్థానిక బీసీ కార్పొరేషన్ కార్యాలయంలో ఆ శాఖ ఈడీ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈడీకి పోతుల లక్ష్మీనరసింహులు వినతిపత్రం అందజేశారు. నాయకులు ఎర్రిస్వామి, నరసింహులు, సత్యనారాయణ పాల్గొన్నారు.

గీత కార్మికులకు పనిముట్లు అందజేయాలి

అనంతపురం అర్బన్, మార్చి 21(ఆంధ్రజ్యోతి): ఆదరణ-3 పథకం ద్వారా కల్లుగీత కార్మికులకు తగిన పనిముట్లు అందజేసేలా చర్యలు తీసుకోవాలని బీసీ కార్పొరేషన్ ఈడీ సుబ్రహ్మణ్యంకు ఈడిగ, గౌడ, శెట్టి బలిజ సంఘం నాయకులు కోరారు. శుక్రవారం స్థానిక బీసీ కార్పొరేషన్ ఈడీ కార్యాలయంలో ఈడీకి నాయకులు మేకల వేణుగోపాల్ గౌడ్, వినతి పత్రం అందజేశారు.

పాస్టర్ల గౌరవ వేతనం జీవో విడుదలపై హర్షం

అనంతపురం అర్బన్, మార్చి 21(ఆంధ్రజ్యోతి): పాస్టర్ల గౌరవ వేతనం జీవోను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయడం హర్షణీయమని టీడీపీ క్రిస్టియన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు స్వామిదాస్ అన్నారు. శుక్రవారం స్థానిక అనంతపురం అర్బన్ టీడీపీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. మూడు నెలలకు సంబంధించి పాస్టర్ల గౌరవ వేతనం రూ.12.82 కోట్లు విడుదల చేశారన్నారు. రాయలసీమ పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు కృపాదాస్, పాస్టర్ ఇస్సాక్, డేవిడ్ పాల్గొన్నారు.

ఆగ్రోస్ మేనేజర్‌గా ఓబుళపతి బాధ్యతల స్వీకరణ

అనంతపురం అర్బన్, మార్చి 21(ఆంధ్రజ్యోతి): ఆగ్రోస్ మేనేజర్‌గా ఓబుళపతి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ మేనేజర్‌గా పనిచేస్తున్న కృష్ణారెడ్డి కొన్ని నెలల క్రితం పదవీ విరమణ పొందారు. అనంతపురం భూసార సంరక్షణా విభాగం ఏడీఏగా ఉన్న ఓబుళపతిని ఆగ్రోస్ మేనేజర్‌గా నియమించారు.

బెంగళూరు మ్యూజియంలో బడిపిల్లలు

- ప్రభుత్వ పాఠశాలల చిన్నారులకు అవకాశం
- మొదటి విడతలో 140 మందికి..

అనంతపురం విద్య, మార్చి 21(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ బడిలో చదువుకునే విద్యార్థులకు అందని ద్రాక్షగా ఉండే విజ్ఞాన విహారయాత్రలను ప్రభుత్వం, పాఠశాల విద్యాశాఖ సాకారం చేస్తున్నాయి. ఖరీదైన విహార యాత్రలకు ఉచితంగా తీసుకెళుతోంది. విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందించడంలో విహార యాత్రకు తీసుకెళ్తున్నారు. జిల్లా, మండల స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో ఎంపికైన విద్యార్థులకు అవకాశం కల్పిస్తున్నారు. ఇందులో భాగంగా జిల్లా నుంచి మూడు బస్సుల్లో విద్యార్థులను బెంగళూరులోని విశ్వేశ్వరయ్య సైన్స్, టెక్నాలజీ మ్యూజియం సందర్శనకు తీసుకెళ్లారు. తొలివిడతలో విద్యార్థులు, టీచర్లను కలిపి 140 మందిని సైన్స్ మ్యూజియం సందర్శనకు తీసుకెళ్లారు. శుక్రవారం 84 మంది విద్యార్థినులు, 39 మంది విద్యార్థులు తమ గైడ్ టీచర్స్ 17 మంది సహకారంతో మ్యూజియం ఆసాంతం తిలకించారు. తాము చూసిన దృశ్యాలను మర్చిపోకుండా పుస్తకాల్లో రాసుకుంటూ, సెల్‌ఫోన్లలో చిత్రీకరించుకుంటూ విద్యార్థులు విజ్ఞానయాత్రను ఆనందించారు.

ఉద్యోగాలకు 40మంది ఎంపిక

అనంతపురం రూరల్, మార్చి 21(ఆంధ్రజ్యోతి): స్థానిక బాలాజీ కాలేజీ ఆఫ్ ఫార్మసీలో మెడ్స్ ఫార్మసీ సంస్థ నిర్వహించిన ప్రాంగణ నియామకాల్లో 40 మంది విద్యార్థులు ఉద్యోగాలకు అర్హత సాధించినట్లు ప్రిన్సిపాల్ శ్రీధర్ తెలిపారు. రెండు రోజులుగా జరుగుతున్న ప్రాంగణ నియామకాలు శుక్రవారం ముగిశాయి. 70మంది విద్యార్థులు పాల్గొన్నారు. వార్షిక వేతనం రూ.2.40లక్షల నుంచి రూ.3లక్షల వరకు ఉంటుందన్నారు. కళాశాల యాజమాన్య ప్రతినిధి శ్రీకాంత్‌రెడ్డి, ప్లేస్‌మెంట్ డీన్ భానుకిరణ్, వెంకటేష్‌నాయక్ పాల్గొన్నారు.

అంకె రామలింగయ్యకు పురస్కారం

అనంతపురం కల్చరల్, మార్చి 21(ఆంధ్రజ్యోతి): నగరానికి చెందిన కవి అంకె రామలింగయ్య తెలుగు-వెలుగు కవితా పురస్కారం అందుకున్నారు. ప్రపంచ కవితా దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం తెలుగు-వెలుగు సాహిత్య సామాజిక సేవా సంస్థ ఆధ్వర్యంలో కవి అంకె రామలింగయ్యకు సంస్థ అధ్యక్షుడు టీవీ రెడ్డి చేతులమీదుగా తెలుగు వెలుగు కవితా జ్ఞాపికను అందజేసి, సత్కరించారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు అల్తాఫ్, విజయభాస్కర రెడ్డి, లక్ష్మీదేవి, మస్తానప్ప పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటు

రాప్తాడు, మార్చి 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని గొందిరెడ్డిపల్లి ఎంఎస్ఎంఈ ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో సీసీ కెమెరాలు అమర్చినట్లు సీఐ శ్రీహర్ష తెలిపారు. పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శుక్రవారం 13 సీసీ కెమెరాలు అమర్చామన్నారు.

లబ్ధిదారులకు ఇళ్లను స్వాధీనం చేయాలి: సీపీఎం

అనంతపురంరూరల్, మార్చి 21(ఆంధ్రజ్యోతి): నగరంలోని లబ్ధిదారులకు ఆలమూరు, కొడిమి తదితర లేఅవుట్‌లలో కేటాయించిన ఇళ్లను స్వాధీనం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి నల్లప్ప డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని ఆలమూరులో ఉన్న లేఅవుట్‌ను పరిశీలించారు. నల్లప్పతోపాటు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నాగేంద్రకుమార్ లేఅవుట్‌లోని ఇళ్లను పరిశీలించారు. నగర కార్యదర్శి రామిరెడ్డి, నగర కార్యదర్శి వర్గ సభ్యులు వెంకటనారాయణ, ముత్తుజా, ఇర్ఫాన్, గోపాల్, ప్రకాష్‌రెడ్డి, మసూద్, కక్కలలిజ్జ ఓబులేసు, రాజు, జీవ పాల్గొన్నారు.

విద్యాశాఖలో అక్రమాలపై విచారణ చేయించాలి

అనంతపురం సెంట్రల్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): జిల్లా విద్యాశాఖలో ఐదేళ్లుగా కొనసాగుతున్న అక్రమాలపై రాష్ట్ర ప్రభుత్వం విచారణ చేయించాలని రిజర్వేషన్ పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఉజ్వల్ శుక్రవారం ప్రకటనలో డిమాండ్‌చేశారు. నకిలీ ఆర్డర్స్, బిల్స్, ప్రశ్నపత్రాలు, ఓంఎఆర్ ముద్రణ, సరఫరా, టెండర్లు లేకుండా కొనుగోళ్లు తదితర వాటిని అక్రమార్జనగా చేసుకుని ప్రజాధనాన్ని కొల్లగొట్టారని ఆరోపించారు. గత వైసీపీ ప్రభుత్వం నుంచి నేటి వరకు అక్రమార్కుల అధికారులు ఇదేతంతు కొనసాగిస్తున్నారన్నారు.

జాతీయ ఆర్చరీ పోటీలకు ఎంపిక

అనంతపురం క్లాక్‌టవర్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఆర్చరీ పోటీలకు జిల్లా క్రీడాకారులు ఎంపికయ్యారు. 23, 24వ తేదీల్లో గుంటూరులోని నాగార్జున యూనివర్సిటీలో జరిగే నేషనల్ ఆర్చరీ పోటీలకు జిల్లాలోని ఎంకే స్పోర్ట్స్ అకాడమీలో శిక్షణ పొందుతున్న సాద్విన్, ప్రజ్ఞతేజ, మాన్య, తరుణిక, మాన్విత, జస్మిత్ ప్రాతినిథ్యం వహించనున్నారు. ఎంపికైన క్రీడాకారులను స్పోర్ట్స్ అకాడమీ హెడ్‌కోచ్ రాహుల్‌బాబు అభినందించారు.

ప్లాస్టిక్ నిషేధానికి వినూత్న ఆలోచన



ఇళ్ల నుంచి తెచ్చుకున్న బాటిళ్లను చూపుతున్న విద్యార్థులు

నార్పల, మార్చి 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని బొందలవాడ గ్రామ పంచాయతీ పాలవర్గం ప్లాస్టిక్ నిర్మూలనకు వినూత్నంగా ఆలోచించి జిల్లాలలోని పలు పంచాయతీలకు ఆదర్శంగా నిలుస్తున్నారు. శుక్రవారం పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు మాట్లాడుతూ ఇంటి అవసరాలకు వినియోగించే సింగిల్ యూస్ కవర్లను రోడ్లలో వేయడం వలన చాలా అనార్థాలు ఉంటాయన్నారు. పంచాయతీ కార్యదర్శి బడి పిల్లలకు టీచర్ల సహకారంతో అవగాహన కల్పించి వారి ఇళ్లలో వాడే కవర్లను వాటర్ బాటిళ్లలో నింపి పంచాయతీ వారికి అందించాలన్నారు. అలా తెచ్చిన పిల్లలకు బహుమతులు ఇస్తామని చెప్పడంతో పిల్లలందరూ కవర్లను తెచ్చి బాటిళ్లలో నింపి పంచాయతీవారికి ఇస్తున్నారు.

ఉద్యోగ విజయోత్సవాలు

అనంతపురం సెంట్రల్, మార్చి 21(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో శుక్రవారం ఉద్యోగ విజయోత్సవాలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ జయచంద్రారెడ్డి అధ్యక్షతన ఏర్పాటుచేసిన కార్యక్రమానికి జేఎన్టీయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ క్రిష్ణయ్య, పూర్వవిద్యార్థి, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ సునీల్‌కుమార్, హ్యుందాయ్ ప్రతినిధి శ్రీనివాసరావు ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించి మాట్లాడారు. విభాగాధిపతులు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

అటవీ పరిరక్షణపై అవగాహన సదస్సు

అనంతపురం సెంట్రల్, మార్చి21(ఆంధ్రజ్యోతి): ప్రపంచ అటవీ దినోత్సవాన్ని పురష్కరించుకుని శుక్రవారం ఆర్ట్స్ కళాశాలలో అటవీ పరిరక్షణపై విద్యార్థులకు అవగాహన సదస్సును నిర్వహించారు. వృక్షశాస్త్ర విభాగంలో ఏర్పాటుచేసిన సదస్సుకు హెచ్‌ఓడీ డాక్టర్ శ్రీదేవి, అటవీ శాఖ అధికారులు దీపా, మల్లికార్జున, ప్రవీణ్ హాజరై మాట్లాడారు. లెక్చరర్ విష్ణుప్రియ అధ్యతన నిర్వహించిన కార్యక్రమంలో అధ్యాపకులు అమృతలక్ష్మి, రఘురాములు, అక్బర్‌బాషా, మనోహర్‌రెడ్డి పాల్గొన్నారు.

చెత్త సేకరణపై దృష్టి పెట్టండి: కమిషనర్

అనంతపురం క్రైం,మార్చి21 (ఆంధ్రజ్యోతి): నగరంలో ప్రతి వార్డులో డోర్‌టు డోర్ చెత్త సేకరణ జరగాల్సిందేనని నగర కమిషనర్ బాలస్వామి మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ విష్ణుమూర్తిని ఆదేశించారు. శుక్రవారం ఆరో సర్కిల్ హమాలీ కాలనీలో ఇంటింటి చెత్త సేకరణపై ఆరా తీశారు. ప్రతి రోజు చెత్త సేకరణ తప్పకుండా చేయాలని, లేకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం ఈద్గా మసీదును సందర్శించారు. రంజాన్ పండుగకు తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. ఎంహెచ్ఓ విష్ణుమూర్తి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటేష్, శానిటేషన్ సెక్రటరీలు పాల్గొన్నారు.

ఏపీ సూపర్ ఫుట్‌బాల్ పోటీల్లో పలు జట్ల గెలుపు

అనంతపురం క్లాక్‌టవర్, మార్చి 21(ఆంధ్రజ్యోతి): ఏపీ సూపర్ ఫుట్‌బాల్ కప్-2025 పోటీల్లో పలు జట్లు గెలుపొందాయి. శుక్రవారం స్థానిక ఆర్డీటీ స్టేడియంలో రెండోరోజు పోటీలు కొనసాగాయి. ఏపీ ఫుట్‌బాల్ అసోసియేషన్ సరిపూటి వేణుగోపాల్, టోర్నీ కమిషనర్ రెడ్డప్పలు పోటీలను పర్యవేక్షించారు. తుంగభద్ర జట్టుపై కోరమాండల్ జట్టు 3గోల్స్ తేడాతో విజయం సాధించగా, వంశధారపై గోదావరి 7గోల్స్, విశాఖపై కొల్లేరు 2గోల్స్ తేడాతో విజయం సాధించాయి. నల్లమల, పెన్నా జట్ల మధ్య జరిగిన పోటీ డ్రాగా ముగిసింది. కార్యక్రమంలో జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ సభ్యులు సుధాకర్, సిరాజుద్దీన్, నీలాద్రి, శేషగిరిరావు, అనీల్, సురేష్, పవన్, రాజేష్, కోచ్‌లు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థికి గాయాలు

శింగనమల, మార్చి21 (ఆంధ్రజ్యోతి): పరీక్ష రాసి తిరిగి గ్రామానికి వెళుతున్న నవీన్ అనే విద్యార్థి ద్విచక్ర వాహనం నుంచి కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. రాచేపల్లికి చెందిన నవీన్ సలకంచెరువు జిల్లా పరిషత్ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్నాడు. శుక్రవారం ఇంగ్లీష్ పరీక్ష రాయడానికి శింగనమలకు తన స్నేహితుడి ద్విచక్ర వాహనంలో వచ్చి పరీక్ష రాసి తిరిగి స్వగ్రామానికి ద్విచక్రవాహనంలో వెళుతుండగా మట్లగొంది వద్ద అదుపుతప్పి నవీన్ కిందపడి గాయపడ్డాడు. స్థానికులు వెంటనే విద్యార్థిని అనంతపురం ఆస్పత్రికి తరలించారు.

వ్యక్తిగత కారణాలతో ఇద్దరు ఆత్మహత్యాయత్నం

కనగానపల్లి, మార్చి 21(ఆంధ్రజ్యోతి): కుటుంబ సమస్యలతో ఇద్దరు వ్యక్తులు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు వేపకుంట గ్రామానికి చెందిన దుర్గాప్రసాద్ అనే యువకుడు ఆస్తిలో వాటా కావాలని తండ్రి వెంకటప్పతో తరుచూ గొడవ పడుతుండేవాడు. ఈ క్రమంలో వెంకటప్పతో గొడవ పడిన దుర్గాప్రసాద్ గురువారం రాత్రి పురుగుల మందు తాగాడు. వెంటనే అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. అలాగే పద్మావతి అనే వివాహిత భర్త కొండప్పతో బంగారు గొలుసు చేయించాలని గొడవ పడింది. మనస్థాపానికి గురైన ఆమె శుక్రవారం ఉదయం విషద్రావకం తాగి అపస్మారక స్థితిలో పడిపోయింది. స్థానికులు ఆమెను అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు.

సీఎం, డిప్యూటీ సీఎం చిత్రపటాలకు క్షీరాభిషేకం




సీఎం, డిప్యూటీ సీఎం చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

అనంతపురం అర్బన్, మార్చి 21(ఆంధ్రజ్యోతి): బేడ, బుడగ జంగాలను ఎస్సీల్లో చేర్చాలని కేంద్రానికి సిఫార్సు చేస్తూ అసెంబ్లీలో తీర్మనం చేసిన నేపథ్యంలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ చిత్రపటాలకు ఆ సంఘం నాయకులు క్షీరాభిషేకం చేశారు. శుక్రవారం స్థానిక అనంతపురం అర్బన్ టీడీపీ కార్యాలయంలో సీఎం, డిప్యూటీ సీఎం చిత్రపటాలకు బేడ,బుడగ జంగాల నాయకులు క్షీరాభిషేకం చేశారు. నాయకులు గంగారామ్, సిరిశాల రాంబాబు, సిరిశాల అంజి, ఎన్‌బీకే నారాయణస్వామి, శ్రీకాంత్, శివకృష్ణ, చిన్న మారెప్ప, కొండ, రమేష్, కుళ్లాయప్ప, వన్నూరప్ప, వెంకటేష్ పాల్గొన్నారు.

నార్పల: స్థానిక టీడీపీ కార్యాలయంలో జిల్లా నాయకులు ఆలం వెంకటనరసానాయుడు ఆధ్వర్యంలో చేనేతలకు ఉచిత విద్యుత్ ముడిసరుకు సబ్సిడీ, ఎన్టీఆర్ గృహ నిర్మాణం కింద రూ.50వేలు మంజూరు చేయడంతో సీఎం చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎన్నో అభివృద్ధికార్యక్రమాలు చేశారన్నారు. ప్రజలకు మంచి చేసే విధంగా రాష్ట్రంలో ఇల్లు లేనిపేదవారు ఉండకూడదు అనే లక్ష్యంగా ఎన్టీఆర్ గృహ నిర్మాణ పథకం కింద అదనంగా రూ.50వేలు మంజూరు చేస్తున్నారన్నారు. సాగునీటి సంఘం అధ్యక్షులు ఆలం నాగార్జున, మండల కన్వీనర్ ఎర్రినాగప్ప, చామలూరు శ్రీనివాసులు, బొగ్గునారాయణస్వామి, లక్ష్మీనారాయణ, చంద్రమోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణపై..

అనంతపురం సెంట్రల్: ఎస్సీ వర్గీకరణపై సోమవారం అంబేడ్కర్ సర్కిల్, ఎస్కేయూలో క్షీరాభిషేకాలు చేశారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందక్రిష్ణ మాదిగ, ప్రధాని నరేంద్రమోదీ, సీఎం నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ చిత్రపటాలకు పాలుపోసి హర్షం వ్యక్తం చేశారు. ఎస్కేయూలో నిర్వహించిన కార్యక్రమంలో రెక్టార్ వెంకటనాయుడు, రిజిస్ట్రార్ రమేష్ పాల్గొన్నారు.



ఎస్కేయూలో క్షీరాభిషేకం చేస్తున్న రెక్టార్, రిజిస్ట్రార్



సీఎం చంద్రబాబు నాయుడును కలిసిన ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ, నాయకులు ఆలం నరసానాయుడు, ముంటిమడుగు కేశవరెడ్డి

రోడ్డు నిర్మాణానికి నిధుల మంజూరు

- సీఎంను కలిసిన కాలవ శ్రీనివాసులు, బండారు శ్రావణిశ్రీ

శింగనమల, మార్చి 21(ఆంధ్రజ్యోతి): బుక్కరాయసముద్రం మండలం కేకే అగ్రహారం రోడ్డు పనులకు సీఎం చంద్రబాబు నిధులను మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ తెలిపారు. శుక్రవారం అసెంబ్లీలో సీఎంను ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు, ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ కలిశారు. ఈ సందర్భంగా కేకే అగ్రహారానికి రోడ్డు ఏర్పాటు చేయాలని విన్నవించగా సీఎం వెంటనే స్పందించి మంజూరు చేశారు. సీఎంకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

సీఎంను కలిసిన టీడీపీ నాయకులు: నియోజకవర్గ అభివృద్ధి, సమస్యలు పరిష్కరించాలని సీఎం చంద్రబాబును ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ, టీడీపీ అధికార ప్రతినిధి ఆలం నరసానాయుడు, ముంటిమడుగు కేశవరెడ్డి, కార్యనిర్వాహక కార్యదర్శి రామలింగారెడ్డి కోరారు. నియోజకవర్గ రాజకీయ పరిస్థితులు, ఇతర సమస్యలు సీఎం దృష్టి తీసుకువెళ్లారు.

సహకార సొసైటీలకు డ్వాక్రా సంఘాలు ఆదర్శం

అనంతపురం క్లాక్‌టవర్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): సహకార సొసైటీలకు ప్రశాంతి జిల్లా సమాఖ్య (డ్వాక్రా మహిళా సంఘాలు) ఆదర్శంగా నిలుస్తోందని జిల్లా సహకార శాఖ అధికారి (డీసీఓ) అరుణకుమారి అన్నారు. ఐక్యరాజ్య సమితి అధికారికంగా 2025 సంవత్సరాన్ని అంతర్జాతీయ సహకార సంవత్సరంగా ప్రకటించిన క్రమంలో శుక్రవారం స్థానిక ప్రశాంతి జిల్లా సమాఖ్య కార్యాలయంలో సొసైటీలపై అవగాహన సదస్సు నిర్వహించారు. డీసీఓ మాట్లాడుతూ ప్రపంచంలో సహకార వ్యవస్థ ఎంతో బలమైందని, పేదలకు అండగా నిలిచేది ఈ సొసైటీలేనని తెలిపారు. డీఆర్‌డీఏ-వెలుగు పీడీ ఈశ్వరయ్య, సైనిక సంక్షేమశాఖ అధికారి తిమ్మప్ప, ఏపీఎం అనితాదేవి పాల్గొన్నారు.

ప్రజాపక్షం వహించేదే అసలైన కవిత్వం

- సీనియర్ కవి డాక్టర్ రాధేయ

అనంతపురం కల్చరల్, మార్చి 21(ఆంధ్రజ్యోతి): ప్రజాపక్షం వహించేదే అసలు సిసలైన కవిత్వం అని సీనియర్ కవి డాక్టర్ రాధేయ అన్నారు. ప్రపంచ కవితా దినోత్సవాన్ని పురస్కరించుకుని కవిసమ్మేళనం సాహిత్య వేదిక, సరోజా గోవిందం సాహితీ సంస్థ, తెలుగు వెలుగు సాహితీ సామాజిక సేవాసంస్థ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం జిల్లాకేంద్రంలోని ఉపాధ్యాయ భవన్‌లో కవి సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమానికి ఉమ్మడిశెట్టి సాహితీ అవార్డు సంస్థ వ్యవస్థాపకుడు, సీనియర్ కవి డాక్టర్ రాధేయ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. కవిత్వం సమాజానికి ఇంధనం అని, ఈ కవిత్వమే సమాజంలోని సమస్యలపై స్వారీ చేసే శక్తిని ప్రజలకు ఇస్తుందన్నారు. డాక్టర్ శాంతినారాయణ మాట్లాడుతూ పుంఖానుపుంఖాలుగా వస్తున్న కవిత్వంలో సారవంతమైన కవిత్వమే కాలానికి నిలుస్తుందన్నారు. జిల్లా రచయితల సంఘం కార్యదర్శి కొత్తపల్లి సురేష్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో పలువురు కవులు పాల్గొన్నారు.

నంబరు ప్లేట్లులేని 60 బైక్‌లు స్వాధీనం

అనంతపురం క్రైం,మార్చి 21(ఆంధ్రజ్యోతి): నగరంలో నంబరు ప్లేట్లు లేని 60 బైక్‌లు స్వాధీనం చేసుకున్నట్లు అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేశ్వర్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నిబంధనలు పాటించి సురక్షితంగా గమ్యాలు చేరుకోవాలన్నారు. శుక్రవారం ఎస్పీ ఆదేశాల మేరకు... రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కళ్యాణదుర్గం రోడ్డు, ఇటుకలపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఆకుతోటపల్లి వద్ద వాహనాలు తనిఖీలు చేశారు. టూవీలర్లు, ఫోర్‌వీలర్లను ఆపి క్షుణ్ణంగా తనిఖీలు చేశారు. నంబర్ ప్లేట్లు లేని 60 ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు. అనంతపురం రూరల్ సీఐ శేఖర్, ఇటుకలపల్లి సీఐ హేమంత్‌కుమార్, ఎస్ఐలు రాంబాబు, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

చమన్ సాబ్ ఆశయాలను కొనసాగిస్తాం

- టీడీపీ యువ నాయకుడు ఉమర్ ముక్తార్



మాట్లాడుతున్న ఉమర్ ముక్తార్

అనంతపురంరూరల్, మార్చి 21(ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ చమన్ సాబ్ ఆశయాలను కొనసాగిస్తామని ఆయన తనయుడు, టీడీపీ యువనాయకుడు డాక్టర్ ఉమర్ ముక్తార్ అన్నారు. శుక్రవారం సాయంత్రం మండలంలోని కక్కలపల్లి క్రాస్ సమీపంలోని ఆర్ కన్వెన్షన్‌లో చమన్ సాబ్ ఫౌండేషన్‌ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ఎంపీ పార్థసారధితోపాటు పలువురు ప్రముఖులు హాజరయ్యారు. ఉపవాస దీక్షలు ఆచరిస్తున్న ముస్లిం మైనార్టీ, నూర్‌బాష సోదరులతో కలసి ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఇఫ్తార్ విందును ప్రారంభించారు. కార్యక్రమానికి వేలమంది హాజరు కావడంతో ఉమర్ ముక్తార్ ఎంతో సంతోషంగా ఉందన్నారు.

వక్ఫ్ బోర్డు బిల్లును సీఎం వ్యతిరేకించారు

- టీడీపీ ముస్లిం మైనార్టీ సెల్ నాయకులు

అనంతపురం అర్బన్, మార్చి 21(ఆంధ్రజ్యోతి): వక్ఫ్ బోర్డు బిల్లును సీఎం చంద్రబాబునాయుడు వ్యతిరేకించారని, వైసీపీ మైనార్టీ నాయకులు ఒకసారి ఆలోచించాలని టీడీపీ ముస్లిం మైనార్టీ సెల్ నాయకులు సూచించారు. శుక్రవారం స్థానిక అనంతపురం అర్బన్ టీడీపీ కార్యాలయంలో మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఫిరోజ్ అహ్మద్, కార్యనిర్వాహక కార్యదర్శి సైఫుద్దీన్, జేఎం బాషా, ముక్తియార్ మీడియాతో మాట్లాడారు. గత వైసీపీ పాలనలో ముస్లిం మైనార్టీలకు ఏం చేశారో సమాధానం చెప్పాలన్నారు. గత టీడీపీ హయాంలో అమలు చేసిన విదేశీ విద్య, దుల్హన్ పథకం, రంజాన్ తోఫా తదితర పథకాలను వైసీపీ రద్దు చేసిందని మండిపడ్డారు. 9 నెలల కాలంలో రాష్ట్రంలో మైనార్టీల కోసం రూ.5434 కోట్ల బడ్జెట్ కేటాయించారన్నారు. అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ మైనార్టీల పక్షపాతి అన్నారు. మైనార్టీ నాయకులు రఫీ, నూర్ మహ్మద్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

మున్సిపల్ కమిషనర్‌పై చర్యలు తీసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం నాయకుడు శ్రీనివాసులు

గుంతకల్లుటౌన్, మార్చి 21(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కమిషనర్‌పై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యుడు బి. శ్రీనివాసులు పేర్కొన్నారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మున్సిపల్ కార్యాలయంలో సిబ్బంది పడుతున్న బాధలు విన్నామని తెలిపారు. మహిళలపై దుర్భాషలాడడం ఈ కమిషనర్‌కు కొత్త కాదని, గతంలో పనిచేసిన చోట ఇంతకంటే దారుణంగా వ్యవహరించారని వివరించారు. ఆర్‌జేడీ విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో ఈనెల 25న మున్సిపల్ కార్యాలయం ముందు ధర్నా చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో సీపీఎం నాయకులు మారుతి ప్రసాద్, జగ్గలి రమేష్, కసాపురం రమేష్, నాగరాజు, రంగమ్మ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

విడపనకల్లు, మార్చి 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని 42వ జాతీయ రహదారిలో రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టినట్లు విడపనకల్లు ఎస్ఐ ఖాజా హుస్సేన్ తెలిపారు. శుక్రవారం మండలంలోని మాళాపురం, విడపనకల్లు గ్రామాల వద్ద 42వ జాతీయ రహదారిపై జీబ్రా (తెల్ల గీతలు) లైన్లు వేయించారు. ప్రమాదకర మలుపుల వద్ద సోలార్ సిస్టమ్ సీసీ కెమెరాలను ఏర్పాటు చేయించారు.

పేర్లు నమోదు చేసుకోండి

పుట్లూరు, మార్చి 21(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని సొసైటీ ఆధ్వర్యంలో పప్పుశనగ కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయనున్నట్లు శుక్రవారం మండల వ్యవసాయ అధికారి కాత్యాయిని తెలిపారు. ఒక క్వింటా పప్పుశనగ ధర రూ.5,650గా ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. పప్పుశనగ పంట దిగుబడిని విక్రయించాలనుకుంటే ముందుగా తమపేర్లు రైతు సేవా కేంద్రంలో నమోదు చేసుకోవాలన్నారు. సరుకును కొనుగోలు కేంద్రానికి చేర్చి అమ్మిన అనంతరం వారంరోజుల్లో ఆయా బ్యాంకు ఖాతాల్లో నగదు జమచేస్తారని తెలిపారు.

టీడీపీ నాయకుడి మృతి



బొమ్మనహాళ్, మార్చి 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని సింగానహళ్లికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు మారెన్న (60) గురువారం రాత్రి మృతి చెందారు. ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు తనయుడు భరత్, టీడీపీ నాయకులు బలరాంరెడ్డి, కేశప్ప మృతదేహన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. కాలవ శ్రీనివాసులు వారి కుటుంబ సభ్యులను ఫోన్‌లో పరామర్శించారు. పార్టీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. నివాళులర్పించిన వారిలో టీడీపీ నాయకులు గోపాల్, ఈరన్న, రమేష్ ఉన్నారు.

పిల్లల సమగ్రాభివృద్ధికి చర్యలు

కణేకల్లు, మార్చి 21(ఆంధ్రజ్యోతి): పిల్లల సమగ్రాభివృద్ధికి అంగన్‌వాడీల ద్వారా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఐసీడీఎస్ సీడీపీఓ లక్ష్మీప్రసన్న పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ఐసీడీఎస్ కార్యాలయంలో అంగన్‌వాడీలకు జరుగుతున్న శిక్షణ కార్యక్రమానికి ఆమె హాజరై మాట్లాడారు. పిల్లలకు అవసరమైన విద్యతో పాటు పౌష్టికాహార పోషణను ఎలా అందించాలన్న విషయంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు రమాదేవి, గీత పాల్గొన్నారు.

వాటర్‌ప్లాంట్ పునఃప్రారంభం

కంబదూరు, మార్చి 21(ఆంధ్రజ్యోతి): మూలనపడ్డ మినరల్ వాటర్ ప్లాంట్‌కు మళ్లీ మోక్షం లభించింది. మండల పరిధిలోని చెన్నంపల్లిలో సర్పంచ్ కోకా ముత్యాలమ్మ ఆధ్వర్యంలో శుక్రవారం మినరల్ వాటర్ ప్లాంట్‌ను పునఃప్రారంభించారు. సుజ్‌లాన్, సీరాకు చెందిన గాలిమరల కంపెనీల సహకారంలో మినరల్ వాటర్ ప్లాంట్‌ను మరమ్మతులు చేసి ప్రారంభించినట్లు సర్పంచు తెలిపారు.

గాలికుంటు వ్యాధి నిర్మూలనకు టీకా

పుట్లూరు, మార్చి 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతకుంట గ్రామంలో శుక్రవారం పశువులకు టీకాలు వేసినట్లు మండల పశువైద్యాధికారి సువర్ణ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పాల దిగుబడిని పూర్తిగా తగ్గించి, పశువును తిరిగి పాడికి పనికి రాకుండా చేసి, రైతుకు తీవ్ర నష్టాన్ని కలిగించే గాలికుంటు వ్యాధిని సమూలంగా నిర్మూలించే దిశగా కేంద్రప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. ప్రతి పశువుకు గాలికుంటు వ్యాధి టీకావేస్తామని తెలిపారు.

25న మండల సమావేశం

పుట్లూరు, మార్చి 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఈనెల 25న సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు శుక్రవారం ఎంపీడీఓ అలివేలమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి మండలస్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు తప్పకుండా హాజరుకావాలని సూచించారు.

ఆర్టీఐ కమిటీ సభ్యుల ధర్నా

కుందుర్పి, మార్చి 21(ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాల ముందు శుక్రవారం ఆర్టీఐ మండల కమిటీ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ శ్రీనివాసులుకు, ఎంపీడీఓవో లక్ష్మీశంకర్‌కు అందజేశారు. పలు రెవెన్యూ సమస్యలు, అధికారుల అవినీతిపై విచారణ చేపట్టాలని వారు కోరారు.

రామగిరిలో గడ్డివామి దగ్ధం

పామిడి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామగిరి గ్రామంలో శుక్రవారం గడ్డివామి దగ్ధమైంది. గ్రామానికి చెందిన శంకరయ్య పశువుల కోసం ట్రాక్టర్ వరిగడ్డి, వేరుశనగ పొట్టుతో గడ్డివామిని వేసుకున్నారు. మధ్యాహ్నం గడ్డివామి నుంచి పొగలు రావడంతో గమనించిన స్థానికులు బాధితుడికి తెలిపారు. స్థానికులు మంటలు ఆర్పేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. సుమారు రూ. 50వేలు నష్టం వాటిల్లినట్లు బాధితుడు ఆవేదన వ్యక్తంచేశారు.



రామగిరిలో అగ్నికి ఆహుతవుతున్న గడ్డివామి

పత్రానికో రేటు..!

● ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి ఇష్టారాజ్యం
● యాడికి తహసీల్దార్ కార్యాలయంలో వసూల్‌రాజా

యాడికి, మార్చి 21(ఆంధ్రజ్యోతి): తహసీల్దార్ కార్యాలయంలో ప్రతి సర్టిఫికెట్‌కు ఒక రేటు నిర్ణయించి ముక్కుపిండి వసూలు చేస్తున్నాడు ఓ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి. ఆయన వసూళ్ల పర్వంపై స్థానికులు మండిపడుతున్నారు. అధికారుల సాక్షిగా సాగుతున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి వసూళ్లపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సర్టిఫికెట్ కోసం వచ్చిన వారు ఎవరైనా ఔట్‌సోర్సింగ్ ఉద్యోగిని ప్రసన్నం చేసుకోవాల్సిందే. లేదంటే నెలలు గడిచినా ఆ పని జరగదు. సర్టిఫికెట్ కోసం ఎవరైనా ప్రశ్నిస్తే వారి దరఖాస్తులు కనబడకుండా పోతాయని తెలుస్తోంది. దీంతో డబ్బులు ఇచ్చి సర్టిఫికెట్లు తీసుకెళుతున్నారు. దీనిపై ఉన్నతాధికారులు పట్టించుకోకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

అవసరాన్ని బట్టి ధర

వివిధ రకాల సర్టిఫికెట్లకు వారి అవసరాన్నిబట్టి ముడుపులు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. రూ.1500 నుంచి మూడు వేల వరకు వసూలు చేస్తున్నాడని బాధితులు పేర్కొంటున్నారు. కుల ధ్రువీకరణపత్రానికి రూ.1000 నుంచి రూ.1500 వరకు వసూలు చేస్తున్నాడు. జనన ధ్రువీకరణపత్రాలకు ఆర్డీఓ కార్యాలయం పేరు చెప్పి రూ.3వేల వరకు వసూలు చేస్తున్నాడని స్థానికులు చర్చించుకుంటున్నారు. ఆదాయ ధ్రువీకరణపత్రం రూ.500, మ్యుటేషన్ కోసం రూ.500 నుంచి 1000 వరకు వసూలు చేస్తున్నాడని సమాచారం. దరఖాస్తుకు రుసుం చెల్లించి వీఆర్వో, ఆర్ఐ, తహసీల్దార్‌తో సంతకాలు చేయించినా ఆన్‌లైన్‌లో ఒకే చేయాలంటే ఆ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగికి ముడుపులు కచ్చితంగా ఇవ్వాల్సిందేనని, లేనిపక్షంలో దరఖాస్తులు మాయమవుతాయని స్థానికులు చెబుతున్నారు.

ముడుపులిస్తే వెంటనే..

తనకు అందాల్సిన ముడుపులిస్తే దరఖాస్తుదారులు తహసీల్దార్ కార్యాలయానికి చేరుకోగానే పనిపూర్తవుతుందనే ఆరోపణలు ఉన్నాయి. ముడుపులు ఇచ్చిన వారు కంప్యూటర్ గదిలోకి వెళ్లి దగ్గరుండి పనిపూర్తి చేసుకొని వెళుతున్నారు. దరఖాస్తుదారులను ఇబ్బందులకు గురిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగిపై చర్యలు తీసుకోవాలని, సకాలంలో సర్టిఫికెట్లు అందేలా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



తహసీల్దార్ కార్యాలయం

మా దృష్టికి రాలేదు : ప్రతాప్‌రెడ్డి, తహసీల్దార్

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి వసూళ్ల సంగతి మా దృష్టికి రాలేదు. ఎవరైనా ఫిర్యాదుచేస్తే విచారించి చర్యలు తీసుకుంటాం. రెవెన్యూ కార్యాలయంలో సర్టిఫికెట్ల కోసం ఎలాంటి డబ్బులు ఎవరికి చెల్లించాల్సిన అవసరం లేదు. ఎవరైనా డబ్బులు డిమాండ్ చేస్తే ఫిర్యాదు చేయవచ్చు.

చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం

గుంతకల్లుటౌన్, మార్చి 21(ఆంధ్రజ్యోతి): స్థానిక మున్సిపల్ కార్యాలయం సమీపంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద శుక్రవారం టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి జింకల జగన్నాథ్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ చట్టానికి అసెంబ్లీలో ఆమోదం తెలపడంపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు చంద్రయ్య, జగన్, సర్పంచు రామాంజినమ్మ, రంగన్న, వీరేష్, ఎల్లప్ప, శ్రీనివాసులు, విజయ్, నరసింహులు పాల్గొన్నారు. ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి కేఎల్ స్వామిదాస్, నాయకులు రాజేష్, సుమంత్, మాతయ్య, డెనియల్, వినోద్ పాల్గొన్నారు.

● పామిడి : రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ బిల్లును శాసనసభలో ఏకగ్రీవంగా ఆమోదించడంపై శుక్రవారం ఎమ్మార్పీఎస్ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక అంబేడ్కర్ సర్కిల్‌లో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ చిత్రపటానికి నాయకులు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు లాలెప్ప, పక్కీరప్ప, ఆదినారాయణ, శాంతరాజు, సర్వేస్ తదితరులు పాల్గొన్నారు.

● గుత్తి : ఎస్సీ వర్గీకరణను అసెంబ్లీ తీర్మానం చేయడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ ఎమ్మార్పీఎస్, టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో స్థానిక అంబేడ్కర్ విగ్రహం, గాంధీ సర్కిల్‌లో మందకృష్ణ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో నాయకులు సునీత, వీరన్న, ఎంకే చౌదరి, శీనా, శ్రీనివాసులు, ప్రతాప్, సోమశేఖర్, బాష, సుధాకర్, నాగప్ప పాల్గొన్నారు.



గుంతకల్లులో చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం.. గుత్తిలో హర్షం వ్యక్తం చేస్తున్న నాయకులు

కేజీబీవీకి దరఖాస్తు చేసుకోండి

గుంతకల్లుటౌన్, మార్చి 21(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఆరో తరగతి, మొదటి సంవత్సరం ఇంటర్‌లో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు గుంతకల్లు కేజీబీవీ విద్యాలయం ఎస్ఓ మహముదాబేగం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 7, 8, 9, 10, 12 తరగతుల్లో మిగిలిన సీట్ల భర్తీ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. మార్చి 22 నుంచి ఏప్రిల్ 11వరకు ఏపీకేజీబీవీ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. వివరాలకు సెల్: 7075159996, 7075039990 సంప్రదించాలన్నారు.

మద్యం దుకాణాల తనిఖీ

గుంతకల్లుటౌన్, మార్చి 21(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మద్యంషాపులు, బార్,రెస్టారెంట్లను శుక్రవారం జిల్లా ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగముద్దయ్య, ఏఈఎస్ శ్రీరామ్ తనిఖీలు చేశారు. మద్యం బిల్లులు, రికార్డులను పరిశీలించారు. మద్యం ధరల వివరాలను అడిగితెలుసుకున్నారు. అనంతరం సారా కేసులో నిందితులను తహసీల్దారు వద్ద బైండోవర్ చేశారు. సీఐ శివసాగర్ పాల్గొన్నారు.

మసీదుల మరమ్మతులకు ఆర్థిక సాయం

ఉరవకొండ, మార్చి 21(ఆంధ్రజ్యోతి): రంజాన్ పండుగను పురస్కరించుకుని పట్టణంలోని మసీదులను శుభ్రపరిచేందుకు ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ రూ.1.05లక్షలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. పట్టణంలోని ఏడు మసీదులకు ఒక్కొక్క దానికి రూ.15వేలు చొప్పున అందజేశారు. స్థానిక టీడీపీ నాయకుల ద్వారా వాటిని అందజేశారు.

రోడ్డు పనుల తనిఖీ

యల్లనూరు, మార్చి 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని గడ్డంవారిపల్లి, యల్లనూరు, మల్లాగుండ్ల, వెన్నపూసపల్లి గ్రామాల మధ్య జరుగుతున్న రోడ్డు పనులను శుక్రవారం క్వాలిటీ కంట్రోల్ అధికారులు తనిఖీ చేశారు. ఈ రోడ్లకు సంబంధించి ఐదు రీచులల్లో నాణ్యతను పరిశీలించారు. ఈ తనిఖీల్లో అధికారులు మల్లికార్జున, రమణ, అరుణ్‌కుమార్, నరేంద్ర పాల్గొన్నారు.

వైద్యం వికటించి చిన్నారి మృతి

రాయదుర్గం రూరల్, మార్చి 21(ఆంధ్రజ్యోతి): ఆర్ఎంపీ వైద్యం వికటించి అనుశ్రీ(3) అనే చిన్నారి మృతి చెందిన సంఘటన రాయదుర్గంలో శుక్రవారం సాయంత్రం జరిగింది. గుమ్మఘట్ట మండలం గలగల గ్రామానికి చెందిన లక్ష్మి, వన్నూరుస్వామి దంపతుల మూడో కుమార్తె అనుశ్రీకి జ్వరం రావడంతో పట్టణంలోని బళ్లారిరోడ్డులోని ఆర్ఎంపీ వద్దకు తీసుకెళ్లారు. ఆయన రక్తపరీక్షలు చేయించారు. అనంతరం పాపకు సెలైన్ బాటిల్ ఎక్కించారు. కొద్దిసేపటికి పాప మాట్లాడకపోవడంతో ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లాలని సూచించారు. దీంతో కుటుంబసభ్యులు పాపను ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. పాప మృతికి కారణమైన ఆర్ఎంపీపై చర్యలు తీసుకోవాలని వారు నిరసన వ్యక్తం చేశారు.

విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి

రాయదుర్గంరూరల్, మార్చి 21(ఆంధ్రజ్యోతి): విద్యారంగంలో నెలకొన్న సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకొని తక్షణమే పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు హనుమంతరావు డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డి.హీరేహాళ్ మండల కేంద్రంలో జూనియర్ కళాశాలకు సొంత భవనం ఏర్పాటు చేయాలన్నారు. జిల్లా వ్యాప్తంగా శిథిలావస్థకు చేరిన హాస్టళ్ల సమస్యలను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు అంజనేయులు, తరుణ్, అభి, శ్రీధర్, గురుప్రసాద్, హరీష్ పాల్గొన్నారు.

ఉపాధి కూలీల సమస్యలు..

గుంతకల్లుటౌన్, మార్చి 21(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ కూలీల సమస్యలను పరిష్కరించాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. మండలంలోని నెలగొండ గ్రామంలో ఉపాధి హామీ పనుల దగ్గరికి శుక్రవారం వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు వెళ్లారు. సమస్యలు తెలుసుకుని సచివాలయం వద్ద నిరసన తెలిపారు. అనంతరం సచివాలయ కార్యదర్శికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి కృష్ణమూర్తి, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ సీఎంతో ఎమ్మెల్యే భేటీ



పవన్ కల్యాణ్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం

గుంతకల్లు, మార్చి 21(ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ సమావేశాలకు వెళ్లిన గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తో భేటీ అయ్యారు. శుక్రవారం పవన్‌తో కలసిన ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలంలోని పలు పంచాయతీల్లో తాగునీటి సమస్య ఉందని, రోడ్లకు, వలసలను ఆపడానికి ఉపాధి పనులకు నిధులను కేటాయించాలని కోరినట్టు తెలిపారు. ఈ మేరకు ఆయనకు వినతిపత్రాన్ని అందజేశారు.

'మున్సిపల్ చట్టాన్ని అతిక్రమిస్తే చర్యలు తప్పవు'

తాడిపత్రి, మార్చి21(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ చట్టాన్ని అతిక్రమిస్తే ఎవరినీ ఉపేక్షించబోమని కౌన్సిలర్ షెక్షావలి పేర్కొన్నారు. స్థానిక జేసీ నివాసంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఫయాజ్‌బాషా మైనార్టీ నాయకుడినని చెప్పుకుంటూ కాలం గడుపుతున్నాడని, 2019లో అనవసరంగా ప్రబోదానంద కేసులో తమపైన కేసులు పెట్టించి రంజాన్ మాసంలో 44 మందిని జైలుకు పంపించారని తెలిపారు. ఇప్పుడు పవిత్రమైన రంజాన్‌మాసం గురించి మాట్లాడుతున్నాడని, నీకు ఒకరికేనా రంజాన్ మాసం అంటూ గతంలో ఇదే మాసంలో కేసులు పెట్టించి లోపలకు పంపించినపుడు రంజాన్ మాసం గుర్తుకు రాలేదా అని ఎద్దేవా చేశారు. అతడిని జైలుకు పంపించేంతవరకు తాము పోరాడుతూనే ఉంటామన్నారు. వైసీపీ రాష్ట్ర కార్యదర్శి, కౌన్సిలర్ ఫయాజ్‌బాషా మున్సిపల్ చట్టానికి విరుద్ధంగా ఇంటి నిర్మాణం చేపట్టాడని వారు ధ్వజమెత్తారు. ఇంటినిర్మాణం ఉన్న స్థలం 14సెంట్లు కాగా వాటిలో 6సెంట్లకు మాత్రమే అనుమతులు పొందాడని, మిగిలిన వాటికి అనుమతులు లేకుండా నిర్మించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.

పరిమితికి మించి తరలిస్తే చర్యలు

పెద్దవడుగూరు, మార్చి21(ఆంధ్రజ్యోతి): ప్రయాణికులను పరిమితికి మించి ఆటోల్లో తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ ఆంజనేయులు తెలిపారు. శుక్రవారం మండలకేంద్రంలోని పోలీస్‌స్టేషన్ ఆవరణంలో ఆటోడ్రైవర్లతో నిర్వహించిన సమావేశంలో ఎస్ఐ మాట్లాడుతూ ప్రతి డ్రైవర్ తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్సును కలిగి ఉండాలన్నారు. పరిమితికి మించి ప్రయాణికులను తరలిస్తుండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు.

● బొమ్మనహాళ్ : పరిమితికి మించి కూలీలను తరలిస్తే వాహనం సీజ్ చేస్తామని బొమ్మనహాళ్ ఎస్ఐ నబీరసూల్ హెచ్చరించారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్ వద్ద శుక్రవారం లగేజీ ఆటో, బొలెరో వాహనాల డ్రైవర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ గూడ్స్ వాహనాలలో కూలీలను తరలించడం అత్యంత ప్రమాదకరమన్నారు. ఓవర్‌లోడ్ తో కూలీలను తీసుకెళితే ప్రమాదాలు జరిగి ప్రాణ నష్టం సంభవించే అవకాశం ఉందన్నారు.

ఫిర్యాదులు పరిష్కరిస్తాం

'మీమాటే ముఖ్యం' ప్రారంభంలో ఏఎస్పీ

యాడికి, మార్చి 21(ఆంధ్రజ్యోతి): ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులన్నింటికి పరిష్కారం చూపుతామని ఏఎస్పీ రోహిత్‌కుమార్ చౌదరి తెలిపారు. ప్రజాఫిర్యాదుల పరిష్కారానికి ఏఎస్పీ కొత్తగా 'మీ మాటే ముఖ్యం' కార్యక్రమాన్ని శుక్రవారం యాడికి పోలీస్‌స్టేషన్‌లో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాడిపత్రి సబ్‌డివిజన్ పరిధిలోని యాడికి, పెద్దపప్పూరు, పెద్దవడుగూరు, తాడిపత్రి పరిధిలోని పోలీస్‌స్టేషన్ల చుట్టూ తిరిగి పరిష్కారానికి నోచుకోని సమస్యలను తన దృష్టికి తీసుకురావచ్చునని తెలిపారు. ప్రజలు నిర్భయంగా తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావచ్చునని అన్నారు. తాడిపత్రి సబ్‌డివిజన్ పరిధిలోని ప్రతి పోలీస్‌స్టేషన్‌లోను ఫిర్యాదుల బాక్స్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. యాడికి పోలీస్‌స్టేషన్‌లో సీసీ కెమెరాల పనితీరును ఆయన పరిశీలించారు. అనంతరం రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ ఇచ్చారు. యాడికి పోలీస్‌స్టేషన్‌లో మీ మాటే ముఖ్యం కార్యక్రమాన్ని ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1గంటల వరకు నిర్వహించారు. పది మంది నుంచి అర్జీలను స్వీకరించారు. శనివారం కూడా యాడికి పోలీస్‌స్టేషన్‌లో మీ మాటే ముఖ్యం నిర్వహిస్తామని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఏఎస్పీ తెలిపారు.



పోలీస్‌స్టేషన్‌లో సీసీ కెమెరాల పనితీరుపై ఆరాతీస్తున్న ఏఎస్పీ

పెన్నహోబిలం ఘటనపై మంత్రి సీరియస్

కానుకల మూట మాయంపై విచారణ



విచారణ చేస్తున్న తహసీల్దార్ మహబూబ్‌బాషా

ఉరవకొండ,మార్చి21(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామికి హుండీలో వేసిన నగలను కాజేయడానికి యత్నించడంపై ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ సీరియస్ అయ్యారు. ఈ ఘటనకు సంబంధించి సమగ్ర విచారణ చేపట్టాలని కలెక్టర్ వినోద్ కుమార్‌కు ఆదేశించారు. ఘటనలో ప్రమేయం ఉన్న వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ మేరకు తహసీల్దార్ మహబూబ్‌బాషా శుక్రవారం విచారణ చేపట్టారు. ఆలయానికి చేరుకుని హుండీ సొమ్ము లెక్కింపునకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. రికార్డులలో బంగారు ఆభరణాలకు సంబంధించిన వివరాలను పొందుపరిచారా.. లేదా అని ఈవో రమేష్‌బాబును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పొంతనలేని సమాధానాలు ఇచ్చారు. హుండీ సొమ్ము లెక్కింపు చేపట్టిన గదిని శుభ్రం చేస్తుండగా దొరికిందని, తర్వాత హుండీలోకి వేసినట్లు తెలిపారు. నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని తహసీల్దార్ తెలిపారు.

ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠ



ప్రతిష్ఠించిన ధ్వజస్తంభం

విడపనకల్లు, మార్చి 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని హావళిగి గ్రామంలో వెలసిన సుంకులమ్మ ఆలయం ముందు శుక్రవారం ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. శుక్రవారం ఉదయం అమ్మవారి మూల విరాట్‌ను ప్రత్యేక పూలతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ధ్వజస్తంభం ప్రతిష్ఠ సందర్భంగా గ్రామంలోని మహిళలు వారి ఆడపడుచులకు వడిబియ్యం పోసే కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఉపాధ్యక్షుడి ఎన్నికకు నోటిఫికేషన్

రాయదుర్గంరూరల్, మార్చి 21(ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ మొదటి ఉపాధ్యక్షుడి ఎన్నికకు నోటిఫికేషన్ విడుదల చేసినట్లు ఎంపీడీఓ కొండన్న శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాయదుర్గం మండలం కెంచానపల్లి ఎంపీటీసీగా ఉన్న సత్యనారాయణనాయుడును మండల పరిషత్ మొదటి ఉపాధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. ఆయన రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో మండల ఉపాధ్యక్షుడి స్థానం ఖాళీ అయింది. దీంతో ఎన్నికల కమిషనర్ ఆదేశాల మేరకు ఈ నెల 27న మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధ్యక్షుడి ఎన్నిక నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ తెలిపారు.

ఎస్ఐ బాధ్యతల స్వీకరణ



యల్లనూరు, మార్చి21(ఆంధ్రజ్యోతి): మండల ఎస్ఐగా శుక్రవారం రామాంజనేయరెడ్డి బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ రామిరెడ్డి ఎస్ఐగా బాధ్యతలు చేపట్టి ఒకరోజులోనే రిలీవ్ అయ్యారు. అప్పటి నుంచి ఇక్కడ ఎస్ఐ పోస్టు ఖాళీగా ఉంది. ప్రస్తుతం రామాంజనేయరెడ్డి కర్నూలు జిల్లా నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు.

ఘనంగా వాసవీ కన్యకాపరమేశ్వరిదేవి ప్రతిష్ఠ



వాసవీమాత విగ్రహం

యాడికి, మార్చి 21(ఆంధ్రజ్యోతి): స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరిదేవి ఆలయంలో శుక్రవారం అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకోవడానికి భక్తులు తరలివచ్చారు.

సర్వే సమయంలో రైతులు రావాలి

కూడేరు, మార్చి 21(ఆంధ్రజ్యోతి): భూముల రీ సర్వే సమయంలో రైతులు భూముల వద్దకు రావాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ తిప్పేనాయక్ సూచించారు. శుక్రవారం కూడేరు మండలం ఇప్పేరు, కొర్రకోడు గ్రామాలను రెండో విడత రీసర్వేనుర పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భూముల సరిహద్దులు ఏర్పాటు చేసిన సమయంలో రైతు లు తప్పక హజరుకావాలన్నారు.

పదో తరగతి విద్యార్థులకు ఆటో ఏర్పాటు

విడపనకల్లు, మార్చి 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని పొలికి గ్రామానికి చెందిన టీడీపీ ఎంపీటీసీ సభ్యురాలు బోయపాటి తిమ్మక్క పదో తరగతి విద్యార్థులకు ఉచితంగా ఆటోను ఏర్పాటు చేశారు. గ్రామానికి చెందిన విద్యార్థులు వజ్రకరూరులోని పరీక్ష కేంద్రాలకు 15 కిలోమీటర్లు ప్రయాణం చేయాల్సి వస్తోంది. 13 మంది విద్యార్థులు ఇబ్బందులు పడుతుండడంతో ఎంపీటీసీ తన సొంత ఖర్చులతో ఆటోను ఏర్పాటు చేశారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

డీ.హీరేహాళ్, మార్చి 21(ఆంధ్రజ్యోతి): ఆత్మహత్యకు యత్నించిన మండలంలోని లింగమనహళ్లికి చెందిన బసవరాజు(24) అనే యువకుడు చికిత్స పొందుతూ గురువారం అర్ధరాత్రి మృతి చెందాడు. ఈ యువకుడు ఈ నెల 13న పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. పోలీసులు, కుటుంబసభ్యులు తెలిపిన మేరకు.. గ్రామానికి చెందిన కురుబ భాగ్యమ్మకు ఇద్దరు కుమారులు ఉన్నారు. రెండో కుమారుడైన బసవరాజు వ్యవసాయం చేసుకుంటూ జీవనం కొనసాగిస్తూ ఉండేవారు. కొన్ని రోజుల కిందట సుమారు రూ. 20 లక్షలు అప్పు చేసి ఒక ఇల్లు నిర్మించారు. ఆ ఇంటికి సంబంధించి అప్పు భారం అధికమవడంతో తమకున్న ఒక ఎకరా పొలాన్ని అమ్మేందుకు ప్రయత్నం చేశారు. కానీ ఆ పొలం కోర్టులో ఉన్నందున అమ్మేందుకు వీలుపడలేదు. దీంతో మనస్తాపం చెందిన బసవరాజు 13న తన పొలం వద్ద పురుగుల మందు తాగాడు. చికిత్స కోసం బళ్లారికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మరణించాడు.

విధుల్లో నిర్లక్ష్యాన్ని సహించేది లేదు

ఉరవకొండ, మార్చి 21(ఆంధ్రజ్యోతి): విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని డీసీహెచ్ఎస్ పాల్ రవి కుమార్ పేర్కొన్నారు. పట్టణంలోని సీహెచ్‌సీ ఆసుపత్రిని శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. ఆసుపత్రికి వచ్చిన రోగుల పట్ల డాక్టర్ నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో డీసీహెచ్ఎస్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో ఆయన ఆసుపత్రికి చేరుకుని విచారణ చేపట్టారు. ఇలాంటి సంఘటనలు పునరావృతమయితే చర్యలు ఉంటాయని సిబ్బందిని హెచ్చరించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ వెంకటస్వామిచౌదరి, డాక్టర్ గంగాధర్ పాల్గొన్నారు.

రక్తదానానికి ముందుకు రావాలి

ఉరవకొండ,మార్చి21(ఆంధ్రజ్యోతి): అన్ని దానాల లో కెల్లా రక్తదానం గొప్పదని, రక్తదానం చేయడానికి ముందుకు రావాలని ప్రిన్సిపాల్ రామకృష్ణ తెలిపారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం రెడ్‌క్రాస్, సత్యసాయి సేవా కమిటీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యసాయి సేవా జిల్లా మెడికల్ కోఆర్డినేటర్ ధనుంజయ మాట్లాడుతూ.. విద్యార్థులు సేవా గుణాన్ని కలిగిఉండాలన్నారు. 30మంది విద్యార్థులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ పీఆర్‌ఓ జీవన్‌కుమార్, వైస్‌ప్రిన్సిపాల్ మస్తానయ్య, కోఆర్డినేటర్ ఆదినారాయణ, ఎన్ఎస్ఎస్ వెంకటరాముడు, అధ్యాపకులు పరమేష్, నారాయణస్వామి, కృష్ణవేణి, సుజాత, రమేష్, పాల్గొన్నారు.